



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

సంచిక : 312 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 28-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# పాక్-ఆఫ్ఘన్ మధ్య యుద్ధం



- పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య భగ్గుమన్న సరిహద్దు వివాదం
- 55 మంది పాక్ సైనికుల మృతి చెందినట్టు ప్రకటించిన ఆఫ్ఘన్
- ఆపరేషన్ గజాబ్-లిల్-హక్.. ఆఫ్ఘన్‌పై పాక్ వైమానిక దాడులు
- ఇరు దేశాలు శాంతించాలని విజ్ఞప్తి చేసిన ఐక్యరాజ్యసమితి

న్యూఢిల్లీ

పాకిస్థాన్ ఆఫ్ఘనిస్థాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. దశాబ్దాలుగా ఉన్న పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు వివాదం తీవ్రరూపం దాల్చిచింది. దీంతో దాయదుల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. తాలిబన్లు జరిపిన దాడులకు ప్రతీకారంగా పాకిస్థాన్ 'ఆపరేషన్ గజాబ్-లిల్-హక్'ను ప్రారంభించింది. పాక్ యుద్ధ విమానాలు కాబూల్, కాందహార్, పక్తియా నగరాల్లోని తాలిబన్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు జరిపాయి. ఈ దాడుల్లో 70 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారని, భారీగా ఆయుధ సంపత్తి ధ్వంసమైందని పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా వెల్లడించింది. మరోవైపు తమ ఎదురుదాడిలో 55 మంది పాకిస్థాన్ సైనికులను హతమయ్యారని, సరిహద్దులోని 19 పాక్ పోస్టులను స్వాధీనం చేసుకున్నామని తాలిబన్ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సంచలన ప్రకటన చేశారు. కొంతమంది పాక్ సైనికులను బందీలుగా పట్టుకున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెట్టారు. దీంతో మా సహనం నశించింది, ఇక యుద్ధమే అని పాక్ రక్షణ

-మిగతా 2 లో




## దేశ ఆర్థిక వ్యవస్థలో మార్పు

- 7.8శాతం వృద్ధి రేటు నమోదు
- గతేడాది 7.4శాతం కన్నా పెరిగినట్లు కేంద్రం శుక్రవారం వెల్లడి

న్యూఢిల్లీ

2025-26 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో దేశ ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. గతేడాది 7.4శాతం కన్నా పెరిగినట్లు కేంద్రం శుక్రవారం తెలిపింది. నూతన జిఎస్‌టి సిరీస్ ప్రకారం ఆర్థిక అంచనాల కోసం 2022-23ని బేసిక్ ఇయర్‌గా తీసుకున్నట్లు తెలిపింది. గతంలో ఇది 2011-12గా ఉండేది. సిరీస్ ప్రకారం ప్రస్తుత సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) 7.6శాతంగా అంచనా వేసినట్లు గణాంకాల మరియు కార్యక్రమ

-మిగతా 2 లో

## దోమల నివారణ,శానిటేషన్‌పై
# ప్రత్యేక దృష్టి

**మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలి**



- హోటల్స్‌లో ఫుడ్ సేఫ్టీకి ప్రత్యేక చర్యలు పెట్టాలి
- అవసరమైతే కిచన్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పరిశీలించాలి
- ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్ వినియోగించాలి
- ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలి
- మున్సిపల్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు

హైదారాబాద్ ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశంచేశారు. మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

-మిగతా 2 లో




## కన్నీరు పెట్టుకున్న
# కేజ్రీవాల్

- మోడీ, అమిత్ షాల కుట్రకు బలయ్యా
- నేను నిర్దోషినని కోర్టు నిరూపించంది
- నన్ను దొంగగా చిత్రీకరించి ప్రచారం చేశారు
- కోర్టు తీర్పుతో ఉద్వేగానికి లోనైన కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న తనను ఆరు నెలలపాటు జైల్లో పెట్టారు. ఇదంతా మోడీ అమిత్ షాల కుట్ర అని, కోర్టు తీర్పు అనంతరం కేజీవ్రాల్ మీడియాతో మాట్లాడుతూ.. కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయంగా తనను దెబ్బతీయడంతో పాటు 'ఆప్‌కు చెందిన ఐదుగురు నేతలను జైల్లో పెట్టారు. నా జీవితంలో ఎన్నడూ తప్పు చేయలేదు. కేవలం విపక్షాలపైనే ప్రధాని మోదీ దృష్టి పెట్టారు. ప్రజా సమస్యలను మోదీ పట్టించుకోరు. నాపై ఎన్నో తప్పుడు కేసులు పెట్టారు. ఆమ్‌ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకు ప్రయత్నించారు. నేను అసలుసిసలైన నిజాయితీపరుడిని.

-మిగతా 2 లో



## రచ్చకెక్కిన విజయ్
# వ్యక్తిగత జీవితం

- భర్తతో మానసికంగా ఐదేళ్లుగా దూరంగా ఉన్నట్లు సంగీత వెల్లడి
- ఇక వేగలేనంటూ చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకులకు దరఖాస్తు
- రాజకీయంగా దెబ్బేనంటున్న పరిశీలకులు

చెన్నై

:తమిళ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం చర్చనీయాంశంగా మారింది. ఆయన భార్య సంగీత సంచలన ఆరోపణలు చేశారు. ఐదేళ్ల కిందటే తాము మానసికంగా విడిపోయామని విజయ్ భార్య సంగీత అన్నారు. విజయ్‌కి ఓ నటితో వివాహేతర సంబంధం ఉందని ఆరోపించారు. ఆ నటితో విదేశాలకు, పార్టీలకు విజయ్ వెళ్తారని చెప్పుకొచ్చారు. విజయ్ తనను వేధింపులకు గురి చేస్తున్నారని.. ఇది ఇలాగే కొనసాగితే ఆ నటి పేరు బయటపెడతానంటూ సంగీత హెచ్చరించారు. వివాహేతర సంబంధం ఓ ద్రోహమని సంగీత ఫైర్ అయ్యారు. విజయ్ వివాహేతర సంబంధం గురించి 2021లో తెలిసిందని అన్నారు.

-మిగతా 2 లో

# మా పెళ్లి విందుకు రండి

- మోడీ అమిత్‌షాలను ఆహ్వానించిన విరోషా జంట
- మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో చాలా గ్రాండ్‌గా రిసెప్షన్
- రిసెప్షన్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరు
- విజయ్, రష్మికల జంట ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్



న్యూఢిల్లీ,

గురువారం పెళ్లి చేసుకున్న హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న రిసిప్షన్ ఏర్పాట్లలో ఉన్నారు. గురువారం ఉదయం 10.10 గంటలకు మూడు ముళ్ల బంధంతో ఇద్దరూ ఒక్కటయ్యారు. ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్‌లో వీరి పెళ్లి జరిగింది. ఉదయం తెలుగు సంప్రదాయం ప్రకారం..

-మిగతా 2 లో

## ఢిల్లీ మద్యం కేసులో అభియోగాలే
# తప్పు ఆధారాలేవీ

- కేసును కొట్టివేస్తూ సిబిఐపై కోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- ఆధారాలు లేకుండా కేసు నడిపారని మండిపాటు
- కేజ్రీవాల, సిసోడియా, కవితలపై కేసు కొట్టివేత
- కోర్టులో సవాల్ చేస్తామని సిబిఐ వెల్లడి



న్యూఢిల్లీ

ఢిల్లీ మద్యం లిక్కర్ పాలసీ కేసును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కొట్టి వేసింది. ఈ కేసులో దోషులుగా ఉన్న దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్ , మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత కు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించింది. సరైన ఆధారాలు లేకుండానే వీరి పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ కేసులో పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని కోర్టు సీబీఐపై మండిపడింది. ఈ విషయంలో సీబీఐ అధికారుల పైనే దర్యాప్తు జరగాలని కోర్టు పేర్కొంది. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా అభియోగాలు మోపిన 23 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపింది. వారిపై ఉన్న అభియోగాలను నిరూపించడంలో సీబీఐ విఫలమైందని వ్యాఖ్యానించింది. ఎటువంటి ఆధారాలు

-మిగతా 2 లో

## అమెరికా వీసా పాలసీల్లో గందరగోళం

- 45శాతం తగ్గిన విద్యార్థుల సంఖ్య
- ఇండియన్ మేనేజ్‌మెంట్ కోరసులకు పెరిగిన డిమాండ్




2 లో

## కడిగిన ముత్యంలా
# తిరిగొచ్చా.

**న్యాయ వ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నిలబడింది**



- రాజకీయ కక్షతో పెట్టిన కేసు
- నా కుటుంబం 5 నెలల పాటు క్షోభ అనుభవించింది
- కష్ట సమయంలో అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత

హైదారాబాద్ ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం సిసోడియాతోపాటు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవితలకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో కేజ్రీవాల్, కవితతో పాటు మొత్తం 23మందికి కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. అయితే, తాజా కోర్టు తీర్పుపై కవిత మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కావాలనే ఇరికించారు. ఈ కేసులో కడిగిన ముత్యంలా బయటకు వస్తానని తెలంగాణ ప్రజలకు తాను మొదటి నుంచీ చెబుతున్నానని ఆమె గుర్తు చేశారు. అందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు తీర్పును వెలువరించిందని తెలిపారు.

-మిగతా 2 లో

## రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా..
# నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే

- పాలమూరులో గెలిచిన కౌన్సిలర్లకు సన్మానం
- రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందనన్న కెటిఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్ పైనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్లకు తెలంగాణ భవన్‌లో సన్మానించారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని

-మిగతా 2 లో

## పాక్-ఆఫ్ఘన్ మధ్య యుద్ధం

మొదటి తరువాయి

మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్రంగా స్పందించారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చెసుకొని ఇరు దేశాలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఈ యుద్ధం వల్ల సరిహద్దు గ్రామాల్లోని వేలాది మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. ప్రస్తుతం సరిహద్దులోని టోర్ఖమ్ గేట్ వద్ద ఇరు వర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి.

## దోమల నివారణ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

మొదటి తరువాయి

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న అన్ని స్ట్రీట్‌లైట్స్‌కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలని సూచించారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. హోటల్స్‌లోని కిచెన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. హోటల్స్‌కి రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్ వినియోగించాలని మార్గనిర్దేశం చేశారు. నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలిని సీఎం రేవంత్‌రెడ్డిసూచన చేశారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## దేశ ఆర్థిక వ్యవస్థలో మార్పు

మొదటి తరువాయి

అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. గతేడాది జనవరిలో అంచనా విడుదలైన అంచనాల ప్రకారం.. ఇది 7.4శాతంగా ఉంది. 2025-26 జులై-సెప్టెంబర్ కాలానికి వృద్ధి రేటును 8.2శాతం నుండి 8.4శాతానికి పెంచారు. అయితే మొదటి త్రైమాసికంలో వృద్ధి రేటును 7.8శాతం నుండి 7.6శాతానికి తగ్గించారు.

## మా పెళ్లి విందుకు రండి

మొదటి తరువాయి

సాయంత్రం కొడవ సంప్రదాయం ప్రకారం పెళ్లి జరిగింది. ఈ పెళ్లికి అతి కొద్ది మంది బంధుమిత్రులను మాత్రమే ఆహ్వానించారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో చాలా గ్రాండ్‌గా రిసెప్షన్ నిర్వహించనున్నారు. రిసెప్షన్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. విజయ్, రష్మికలు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న రిసెప్షన్‌కు రావాలని ప్రధానికి ప్రత్యేక ఆహ్వానం అందించారు. అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిశారు. పెళ్లి రిసెప్షన్‌కు రావాలని అహ్వానించారు. ఈ సందర్భంగా ఇన్విటేషన్‌తో పాటు వినాయకుడి విగ్రహాన్ని కూడా ఆయనకు అందించారు. విజయ్, రష్మికల జంట ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

### రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా..

## నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే

మొదటి తరువాయి

నిరూపిస్తోందన్నారు. ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు. కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, ప్లలె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్టాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు.ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## కడిగిన ముత్యంలా తిరిగొచ్చా..

మొదటి తరువాయి

న్యాయ వ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని కవిత వివరించారు. ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని తాను ఎన్నోసార్లు చెప్పానన్నారు. ఈ కేసు వల్ల తాను, తన కుటుంబం 5 నెలల పాటు క్షోభ అనుభవించామన్నారు. కష్ట సమయంలో తనకు అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు. తన కుటుంబానికి దూరమై, 5 నెలలు జైలులో గడిపిన సమయాన్ని ఎవరు తిరిగిస్తారని ఆమె ప్రశ్నించారు. కోర్టు తీర్పు రాకుండానే కొందరు అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఓటమిని నాపై రుద్దాలని చూస్తే ప్రజలు ఊరుకోరని జాగృతి అధ్యక్షురాలు కవిత ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ ఓడిపోవడానికి నేను కారణమని ప్రచారం చేస్తున్నారు, ఖు= ఏం మాట్లాడినా చెల్లుతుందని అనుకుంటున్నారు ఇది తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. నా మీద కేసు పెట్టింది పార్టీ కోసం కాదా, తప్పు తేలకుండానే నా వ్యక్తిత్వ హననం చేశారు. కేసు పెట్టినప్పుడు, తప్పుడు ప్రచారం చేసినప్పుడు ఎందుకు స్పదించలేదని ప్రశ్నించారు. తప్పు చేయకపోయినా ఏడాదిగా మానసిక క్షోభ అనుభవించనని వాపోయారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనని కవిత ఆరోపించారు. రెండు నెలల్లో కొత్త పార్టీ పెట్టబోతున్నాని జాగృతి అధ్యక్షురాలు స్పష్టం చేశారు.

## కన్నీరు పెట్టుకున్న కేజ్రీవాల్

మొదటి తరువాయి

నేను కేవలం ప్రజల కోసమే పనిచేశాను. నిజం ఎప్పటికైనా గెలుస్తుంది' అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారీ ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని, వాటికి సాక్షులు లేదా స్టేట్‌మెంట్ల మద్దతు లేదని స్పష్టం చేసింది. సిసోడియాపై ప్రాథమికంగా కేసు కూడా నిలబడలేదని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా లను కోర్టు డిశ్చార్జ్ చేసింది. కేజ్రీవాల్‌ను సరైన ఆధారాలు లేకుండా ఇరికించారని జడ్జి వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది రౌస్ అవెన్యూ కోర్టు కవితపై సీబీఐ





నమోదు చేసిన అభియోగాలన్నిటిని కొట్టివేసింది. ఈ మేరకు సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కవితతో పాటు ఈ కేసులో ఉన్న 23 మంది నిందితులు తప్పు చేశారన్న సాక్ష్యాదారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యానించింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది.కేసులో నిర్దోషిగా విడుదలైన తర్వాత అరవింద్ కేజ్రీవాల్ భావోద్వేగానికి గురయ్యారు. మీడియా ముందు కన్నీరు పెట్టుకున్నారు. తీర్పు తర్వాత, తనపై ఉన్న కేసు పూర్తిగా కల్పితమని మరోసారి పునరుద్ఘాటించారు. ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేయడానికి స్వతంత్ర భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీలోని ఐదుగురు ప్రముఖ నాయకులను జైలులో పెట్టారని గుర్తు చేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అరెస్టు చేసి జైలుకు పంపారని, ఇది భారత చరిత్రలో ఇంతకు ముందెన్నడూ జరగలేదని అన్నారు. తాను ఆరు నెలలు జైలులో ఉన్నానని, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా దాదాపు రెండు సంవత్సరాలు జైలులో గడిపారని తెలిపారు. ఈ లిక్కర్ వ్యవహారం కల్పితమని, తన ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా దుష్ప్రచారం చేస్తున్నారని కేజ్రీవాల్ అన్నారు. టీవీ ఛానెళ్లలో తనను పదే పదే అవినీతిపరుడిగా చిత్రీకరించారని కన్నీరుమున్నీరుగా విలపించారు.

## రచ్చకెక్కిన విజయ్ వ్యక్తిగత జీవితం

మొదటి తరువాయి

ఆ నటితో సంబంధం తెంచుకుంటానని విజయ్ తనతో చెప్పారని ప్రస్తావించారు. మాట తప్పి ఆ సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పదేపదే తమ మధ్య విభేదాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఆ నటికి మద్దతుగా విజయ్ మాట్లాడుతూ వచ్చారని.. ఆయన నిర్లక్ష్యం కారణంగా తాను ఒంటరినయ్యానని సంగీత పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన భార్య సంగీత చెంగల్‌పట్టు కుటుంబ న్యాయస్థానంలో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివాహ జీవితం సజావుగా కొనసాగడం లేదని, వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయస్థానం ఈ పిటిషన్‌ను స్వీకరించగా.. ఏప్రిల్ 20వ తేదీన కోర్టుకు హాజరుకావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. విజయ్, సంగీత వివాహం 1999లో జరిగింది. సంగీత లండన్‌కు చెందిన తమిళ కుటుంబానికి చెందినవారు. విజయ్ నటుడిగా ఎదుగుతున్న సమయంలో ఆయన అభిమానిగా సంగీత పరిచయం అయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారింది. కుటుంబ సభ్యుల సమ్మతితో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ



దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, వివాహమైన కొంతకాలం తర్వాతే ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు ప్రారంభమైనట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా వీరిద్దరూ వేర్వేరుగా జీవిస్తున్నారని సినీవర్గాల్లో ప్రచారం ఉంది. ప్రత్యేకంగా విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత వ్యక్తిగత జీవితంలో మార్పులు వచ్చాయని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య విభేదాలు మరింత పెరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు సంగీత విడాకులు కోరుతూ పిటిషన్ వేయడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. విజయ్, త్రిషకు మధ్య సంబంధం ఉందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల తమిళనాడుకు చెందిన కొందరు రాజకీయ నేతలు సైతం ఇవే కామెంట్స్ చేశారు. విజయ్ త్రిష ఇంటిని విడిచి ప్రజల్లోకి రావాలంటూ బీజేపీ నాయకుడు నయినర్ నాగేంద్రన్ కామెంట్ చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు తమిళనాట పెద్ద వివాదానికి దారి తీశాయి. ఈ వ్యాఖ్యలపై త్రిష తీవ్రంగా స్పందించడం.. ఆ తర్వాత నాగేంద్రన్ క్షమాపణలు చెప్పడంతో వివాదం కాస్త సద్దుమణిగింది. ఇంతలో సంగీత విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో.. విజయ్ - త్రిష రిలేషన్ ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లయ్యింది. విజయ్ ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించి తమిళగ వెట్రి కళగం పార్టీని స్థాపించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని ఆయన రాజకీయ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఈ సమయంలో వ్యక్తిగత జీవితంలో ఇలాంటి పరిణామం చోటుచేసుకోవడం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందా అనే చర్చ జరుగుతోంది. అయితే, విజయ్ అభిమానులు మాత్రం ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. విజయ్ తమిళ సినీ పరిశ్రమలో అత్యంత ప్రజాదరణ పొందిన నటుల్లో ఒకరు. ఆయన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ఈ వార్త అభిమానులను కలవరపరిచింది. సోషల్ మీడియాలో అభిమానులు తమ స్పందనలు తెలియజేస్తున్నారు.

## ఢిల్లీ మద్యం కేసులో అభియోగాలే తప్ప ఆధారాలేవీ

మొదటి తరువాయి

లేకుండా కేవలం ఊహాగానాల ఆధారంగా ఈ కేసులో కుట్ర జరిగిందని సీబీఐ అధికారులు ఆరోపించారని న్యాయస్థానం పేర్కొంది. కానీ దానిని నిరూపించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎక్సైజ్ పాలసీపై ముగ్గురు న్యాయ నిపుణుల అభిప్రాయాలు తమ కేసుకు మద్దతు ఇస్తున్నాయని గతంలో సీబీఐ చేసిన ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ కోర్టు తీర్పును సవాలుచేస్తూ సీబీఐ అధికారులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. దిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత






మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ తెలంగాణ ఎంపీ కవితలను అధికారులు అరెస్టు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. సీబీఐ కోర్టు ఈ కేసునుంచి కేజ్రీవాల్‌ను డిశ్చార్జ్ చేసింది. శుక్రవారం ఢిల్లీ మద్యం పాలసీ కేసుపై ది రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది. సీబీఐ వేసిన చార్జ్‌షీట్‌లో మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి సిసోడియాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చింది. కవితతో పాటు 23 మంది నిందితులు తప్పు చేసినట్టు సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. అందరికీ క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును సీబీఐ సవాల్ చేయనుంది.

## అమెరికా వీసా పాలసీల్లో గందరగోళం

-45శాతం తగ్గిన విద్యార్థుల సంఖ్య
-ఇండియన్ మేనేజ్‌మెంట్ కోరసులకు పెరిగిన డిమాండ్

**న్యూఢిల్లీ,**
ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లాలనేది ఒకప్పుడు ఎంతోమంది భారతీయ విద్యార్థుల కల. కానీ.. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అమెరికాలో వీసాలపై నెలకొన్న అనిశ్చితి, ట్రంప్ పరిపాలనలో తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికాకు వెళ్లి చదువుకోవాలనే భారతీయ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లాయి. గ్రాడ్యుయేషన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన శ్వేతపత్రంలోని అంశాలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. అమెరికా యూనివర్సిటీల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఆగస్ట్ 2025 నాటికి 45 శాతం తగ్గిందని శ్వేతపత్రంలో స్పష్టం చేసింది. అయితే.. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. ఇండియన్ గ్రాడ్యుయేషన్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు దరఖాస్తుల సంఖ్య అంతర్జాతీయంగా 25 శాతం పెరగడం విశేషం. వీసా పాలసీల్లో నెలకొన్న సమస్యలు, గందరగోళం కారణంగా.. ఉత్తర అమెరికా స్టడీ కారిడార్ ఆధిపత్యం దారుణంగా పడిపోయింది. ఈ పరిణామం..




ఆసియా దేశాలకు, ఐరోపా దేశాలకు అనుకూలంగా మారింది. అంతర్జాతీయంగా ఆసియా, ఐరోపా దేశాల్లో విదేశీ విద్యార్థుల దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కెనడా, అమెరికా, ఐఐలో వీసా విధానంలో మార్పులు, రాజకీయ పరిస్థితులు వీసా దరఖాస్తులు తగ్గడానికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. అమెరికాలో చదువుకోవాలనుకునే మన దేశ విద్యార్థులకు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్? ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు కష్టాలు తెచ్చిపెడుతున్న సంగతి తెలిసిందే. వీసా రూల్స్?ను కఠినతరం చేయడం, వలస చట్టాలకు ట్రంప్?పదును పెట్టడంతో అక్కడ చదువుకోవాలనుకునే వారికి ఈ నిర్ణయాలు తలనొప్పిగా మారాయి. గతంలో ఎన్నడూ లేనంతగా విద్యార్థుల వీసాలు తిరస్కరణకు గురవుతున్నాయి. వీసా వచ్చినవాళ్లు అక్కడ చదువుకుందామని అనుకున్నా.. ఆ చదువుల ఖర్చు తడిసి మోపెడవుతున్నది. ఇటు పార్ట్? టైం జాబ్?లు చేసుకోవడానికీ అవకాశాలు లేకుండా పోతుండడంతో అమెరికా మీద స్టూడెంట్స్? ఆశలు వదిలేసుకుంటున్నారు. ఆ దేశానికి బదులు ఇతర దేశాలపై ఆసక్తి చూపిస్తున్నారు. అమెరికాలో ఫీజులు కూడా భారంగా మారుతున్నాయి. గత ఐదేండ్లతో పోలిస్తే అక్కడ చదువుల ఖర్చులు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం ప్రైవేట్?వర్సిటీల్లో చదవాలంటే రూ.40 లక్షల దాకా ఖర్చు చేయాల్సి వస్తున్నది. గతంలో రూ.25 లక్షల వరకు ఖర్చయ్యేది. ప్రభుత్వ వర్సిటీల్లో చదివేందుకు రూ.17 లక్షల దాకా ప్రస్తుతం ఖర్చు చేయాల్సిన పరిస్థితులున్నాయని, గతంలో అందులో సగమే ఉండేదని స్టూడెంట్స్ చెబుతున్నారు. ఇప్పుడు తిండి తిప్పలు, ఇతరత్రా ఖర్చులకూ ఏటా రూ.12 లక్షలు, హెల్త్? ఇన్సూరెన్స్?కు మరో రూ.లక్షన్నర దాకా ఖర్చు చేయాల్సి వస్తున్నదని అంటున్నారు.

# రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్



**పెద్దపల్లి, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రేషన్ డీలర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం శుక్రవారం సిరి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర కమీషన్ పేరుతో కాలాయాపన చేయకుండా ఒకే కమీషన్ చెల్లించాలని, గత ఏడాది నుండి రేషన్ షాపుల్లో మగ్గుతున్న దొడ్డుబియ్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. అలాగే డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవవేతనం చెల్లించాలని, పదేళ్ల బకాయిలను ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా గుర్తించి తక్కువ ధరకే నిత్యావసర సరుకులు అందుబాటులోకి తేవాలని, డీలర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, వేబ్రిడ్జీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కరోనా కారణంగా మరణించిన డీలర్ల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని, అద్దె, కరెంట్ బిల్లులు, ఇతర ఖర్చులను ప్రభుత్వమే భరించాలని కోరారు. హైదరాబాద్‌లో రేషన్ భవన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని, అర్హతను బట్టి డీలర్లకు పదోన్నతులు కల్పించాలని రమేష్ బాబు అన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడిగా మద్దెల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా దొంకెన తిరుపతి గౌడ్ బాధ్యతలు చేపట్టారు. సమావేశంలో రెడ్డిమల్ల హన్మాండ్లు, ఊక శేఖరరావు, చంద్రశేఖర్, పులిమామిడి లక్ష్మినారాయణ, కిరణ్ కుమార్ రెడ్డి, చిలగాని మోహన్, పోతరాజు రమేష్, భానుచందర్ రావు, వెంకన్న, భాస్కర్ రెడ్డి, సందీప్, గాండ్ల రవికుమార్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## గన్నేరువరం హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పరిశీలన



**గన్నేరువరం, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలో పారువెల్లదుబ్బపల్లె మార్గమధ్యలో ఉన్న లోలెవెల్ బ్రిడ్జి వర్షాకాలంలో రెండు మూడు నెలలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించడానికి ప్రత్యేక అధికారులు గ్రామాన్ని సందర్శించారు. పీఎంజీఎస్‌వై పథకంలో కిలోమీటర్ నర రోడ్డు మంజూరు చేయడం లో భాగంగా ఎన్ఐటి ప్రొఫెసర్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు కలిసి బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. స్థానిక రైతులను అడిగి వరద తీవ్రత, బ్రిడ్జి అవసరంపై వివరాలు సేకరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలికంగా ఉండే నాణ్యమైన బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరు చేయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజేష్ కుమార్, ప్రొఫెసర్ శంకర్, పిఆర్డిఇ మంజుల భార్గవి, రవి ప్రసాద్, ప్రవీణ్ కుమార్, స్థానిక సర్పంచ్ లక్ష్మీరామిరెడ్డి, ఉప సర్పంచ్ తిరుపతి, మాజీ సింగిల్ విండో చైర్మన్ అల్వాల కోటి, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నర్సక్కపేటలో పేదలకు ఉచిత బియ్యం పంపిణీ



**ఇల్లంతకుంట, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇల్లంతకుంట మండల నర్సక్కపేట గ్రామంలో సర్పంచ్ బెంద్రం శంకరమ్మ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదలకు ప్రతి నెలా 10 కిలోల బియ్యం ఉచితంగా అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 10 హామీలలో మొదటిది పారిశుధ్యం, పరిశుభ్రతపై చర్యలు తీసుకోవడం కాగా, రెండవ హామీగా నిరుపేదలకు ఐదు సంవత్సరాల పాటు ప్రతి నెలా 10 కిలోల బియ్యం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు నన్ను గెలిపించిన ఋణాన్ని తీర్చుకుంటున్నానని, ప్రతి హామీని నెరవేర్చుతానని శంకరమ్మ అన్నారు. ఈ బియ్యం పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గుంటూరు పల్లి అంగన్వాడీ స్థాయి కమిటీ ఏర్పాటు



**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బొమ్మకల్ 6వ డివిజన్ గుంటూరు పల్లి గ్రామంలో అంగన్వాడీ స్థాయి పర్యవేక్షణ సహాయక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా 6వ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. కన్వీనర్‌గా రజియా బేగం, సభ్యులుగా శంకరమ్మ, జి. రమ్య, కుతియా బేగం, నాగలక్ష్మి, రజిని, నాయిని సత్యనారాయణ, బట్టు లావణ్య, నాదేం రజిత, బాసోజు ఉమారాణి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయవేణి సదానందం, పుట్టపాక శ్రీధర్‌తో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కోటి తలంబ్రాల దీక్ష కరపత్రాల ఆవిష్కరణ



**ఎర్రవల్లి, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భద్రాచల రాములోరి కల్యాణ తలంబ్రాల్లో పాల్గొనాలని కోరుతూ కోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి హనుమాన్ దేవాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు మాట్లాడుతూ, “భద్రాచలం నుండి వస్తున్న కోటి తలంబ్రాలను కలశాలతో స్వాగతం పలికి ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తితో సమర్పించనున్నాం. ఇట్టి పుణ్య కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలి” అని సూచించారు.

## కవితపై కేసు కొట్టివేత అంబరాన్నంటిన జాగృతి సంబరాలు



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ జాగృతి అధినేత్రి కవితపై పెట్టిన ఢిల్లీ లిక్కర్ కేసును రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేయడంతో కరీంనగర్‌లో జాగృతి కార్యకర్తలు సంబరాలు జరిపారు. టపాసులు కాల్చి, స్వీట్స్ పంపిణీ చేశారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, కవితపై పెట్టిన కేసు తప్పుడు కేసు అని కోర్టు తేల్చి చెప్పడం సంతోషకరమని, ఇది కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా దెబ్బ కొట్టే ప్రయత్నమేనని అన్నారు. కవితతో పాటు కేజ్రీవాల్, మనీష్ సిసోడియా వంటి నేతలకు కూడా క్లీన్ చీట్ రావడం ధర్మం గెలిచిన నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డపై అక్రమ కేసులు పెట్టిన కేంద్ర ప్రభుత్వానికి న్యాయస్థానం చెంపదెబ్బ కొట్టినట్లుగా తీర్పు ఇచ్చిందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెబుతారని హరిప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, అధివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు అక్కం శివరాణి, బిసి విభాగం అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, సీనియర్ నాయకులు వారల శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, పిన్నింటి సంగీత రెడ్డి, యండి సల్మ, పూదరి రజేశ్వరి గౌడ్, కుర్ర పోచాయ్య, గాలిపల్లి రాత్నకర్ చారి, యండి హుసైన్, జంగ అపర్ణ, బండ అశోక్, సంతోష్ యాదవ్, కుర్ర కౌసిక్, బసవేణి రాజేందర్, కొత్తురి రఘు, గుండెటి తిరుపతి, పుసాల పవన్, ఎండి రజీ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా పై బహిరంగ లేఖ



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. రైతు భరోసా పథకం అమలు చేయకపోవడం రైతాంగాన్ని మోసం చేయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 4న మిర్యాలగూడ సభలో మున్సిపల్ ఎన్నికల అనంతరం రైతు భరోసా సొమ్ము విడుదల చేస్తామని సీఎం స్వయంగా ప్రకటించారని, కానీ ఇప్పటికీ అమలు చేయకపోవడం మాట తప్పడమేనని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారని, తక్షణమే రెండు విడతల రైతు భరోసా సొమ్ము చెల్లించాలని, మూడో విడతతో కలిపి రూ.27 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. గత 9 నెలలుగా రూ.9 వేల కోట్లు మాత్రమే విడుదల చేసి, రైతులకు పెద్దగా ఉపయోగం కలిగించలేదని విమర్శించారు. తక్షణమే రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లేనిపక్షంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బండి సంజయ్ హెచ్చరించారు.

## కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రా బాధ్యతలు స్వీకరణ



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్‌గా చిత్రా మిశ్రా శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## అర్రివే అలీవ్ కంటి పరీక్ష శిబిరం విజయవంతం



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అర్రివే అలీవ్ ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతంగా ముగిసింది. లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్‌తో కలిసి నిర్వహించిన ఈ మెగా శిబిరంలో 448 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు. నగరంలోని ప్రముఖ కంటి ఆసుపత్రులు పాల్గొని ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించాయి. డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ 85 మందికి, వాసన్ ఐ కేర్ 96 మందికి, లయన్స్ డాక్టర్ మాడేకర్ ఐ హాస్పిటల్ 85 మందికి, శరత్ మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ 95 మందికి, డాక్టర్ రాకేష్ ఐ హాస్పిటల్ 87 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి లయన్స్ క్లబ్ తరఫున 200 కళ్లద్దాలు, 200 కంటి చుక్కల మందులు ఉచితంగా అందజేశారు. రేకుర్తి హాస్పిటల్ వారు 50 మందికి ఉచిత సర్జరీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ “సురక్షిత చూపు సురక్షిత డ్రైవింగ్ సురక్షిత గమ్యం” అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టామని, డ్రైవర్ల కంటి చూపు సరిగా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అదనపు డీసీపీ భీంరావు, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ తరఫున అధ్యక్షుడు లయన్ ఏ. రవీందర్ రెడ్డి, వి. రాధాకృష్ణ రెడ్డి, వెంకట రమణ రెడ్డి, గౌతమ్, హెచ్. రాజిరెడ్డి పాల్గొన్నారు.

# కూనారం ఆర్.ఓ.బీ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బీ) అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీ హర్ష కూనారం ఆర్.ఓ.బీ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పూర్తయి సంబంధిత శాఖకు బదలాయించామని, ఇప్పుడు పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైన నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అండర్ పాస్ పనులు నెల రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్.ఓ.బీ పూర్తయ్యే లోపు అప్రోచ్ రోడ్డు కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, పెద్దపల్లి ఆర్డిఓ బి. గంగయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా బొమ్మకల్ శివాలయం అష్టమ వార్షికోత్సవాలు



**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బొమ్మకల్ 6వ డివిజన్‌లో శివాలయం అష్టమ వార్షిక మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్, 5వ డివిజన్ కార్పొరేటర్ గాదె స్వరూపశ్రీనివాస్, 4వ డివిజన్ కార్పొరేటర్ భూపతి రవీందర్, 1వ డివిజన్ కార్పొరేటర్ బారి అపర్ణజితేందర్, కాంటెస్ట్ ఎమ్మెల్యే పురుమల్ల శ్రీనివాస్, రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి, అసిరి తిరుపతి, బీజేపీ నాయకులు సాయవేణి సదానందం, చిందం అశోక్, రవీందర్, మహేష్, పుట్టపాక శ్రీధర్, గాలిపెల్లి నారాయణ, కోరుకంటి యుగేందర్, సాయి చంద్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై మహోత్సవాలను విజయవంతం చేశారు.

# సరస్వతీ శిశు మందిర్ నూతన భవనానికి భూమి పూజ



**జమ్మికుంట, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం జమ్మికుంటలో భూమి పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ (దిలీప్) హాజరై భూమి పూజలో పాల్గొన్నారు. కౌన్సిలర్లు శీలం శ్రీనివాస్, దిడ్డి కోమల (రాము), ఒగ్గు రమేష్, కొలుగూరి సురేష్, చింతల శ్రీనివాస్, కొలగాని రాజకుమారి, రాజు, గుర్రం కావ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు. సరస్వతీ విద్యాపీఠ జిల్లా కార్యదర్శి తేల్ల రాజమౌళి, నేత్రవైద్య నిపుణులు చిట్టీరెడ్డి శ్రీనివాస రెడ్డి, ముక్క రాజేశ్వరయ్య, పాఠశాల వ్యవస్థాపక ప్రధానాచార్యులు పూజారి సాంబయ్య, సమితి కార్యదర్శి ఆకుల రాజేందర్, ఉపాధ్యక్షులు పాకాల రవీందర్ రెడ్డి, కార్యదర్శి దాసరి రవీందర్, సభ్యులు బుర్ర శివయ్య, శ్రీమన్నారాయణ, కేతిపల్లి మాధవ రెడ్డి, దొంతుల రాజకుమార్, రావికంటి నీలకంఠం, గాౖరెపల్లి నిరుపమ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానాచార్యులు గుడికందుల సుదర్శన్, పూర్వ విద్యార్థులు, పూర్వాచార్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆచార్యులు కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమం పురోహితుడు ఎలుపాక ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరిగింది.

# సైన్స్‌లో మహిళల శక్తి వికసిత్ భారత్ దిశగా ముందడుగు




జాతీయ సైన్స్ దినోత్సవం 2026 దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడింది. ఈ ఏడాది ఇతివృత్తం సైన్స్‌లో మహిళలు వికసిత్ భారత్‌కు ఉత్ప్రేరక శక్తిగా నిర్ణయించబడింది. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో మహిళా శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఆవిష్కర్తల కీలక పాత్రను ఈ థీమ్ ప్రత్యేకంగా ప్రతిబింబించింది. 1928 ఫిబ్రవరి 28న సర్ సి.వి. రామన్ కాంతి వికీర్ణానికి సంబంధించిన లిరామన్ ఎఫెక్ట్ అనే విప్లవాత్మక ఆవిష్కరణ చేశారు. ఈ ఆవిష్కరణకు గాను ఆయన 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. ఈ ఘనతను స్మరించుకుంటూ 1986లో భారత ప్రభుత్వం ఫిబ్రవరి 28ను జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించింది. 2026 సైన్స్ దినోత్సవం స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించింది. పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణల్లో మహిళల నాయకత్వాన్ని గుర్తించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, మహిళలు నేతృత్వంలోని శాస్త్రీయ పురోగతిని ముందుకు తీసుకెళ్లడం ప్రధాన లక్ష్యాలుగా నిలిచాయి. భారతదేశం అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో విజయాలు, అణు శక్తి రంగంలో పురోగతి, వైద్య పరిశోధనలు, డిజిటల్ టెక్నాలజీ, ఐటీ రంగం సాధించిన గుర్తింపు. ఇవి శాస్త్రం దేశాభివృద్ధికి ఎంత కీలకమో స్పష్టంగా చూపిస్తున్నాయి. జాతీయ సైన్స్ దినోత్సవం యువతకు తార్కిక ఆలోచన, పరిశోధన, ఆవిష్కరణల ద్వారానే దేశ పురోగతి సాధ్యమని స్పష్టమైన సందేశం ఇస్తోంది. శాస్త్రీయ దృక్పథం పెంపొందితేనే మూఢనమ్మకాలకు చెక్ పెట్టి స్థిరమైన అభివృద్ధి సాధ్యమని గుర్తు చేస్తోంది. ఈ వేడుక కేవలం ఒక జ్ఞాపకోత్సవం మాత్రమే కాదు, శాస్త్రంసమానత్వం ఆవిష్కరణల సమన్వయంతో భారత్ వికసిత్ దేశంగా మారే దిశగా సాగుతున్న ప్రయాణాన్ని ప్రతిబింబిస్తోంది. మహిళల సమాన భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యమని బలమైన సందేశంతో జాతీయ సైన్స్ దినోత్సవం 2026 దేశవ్యాప్తంగా ఉత్సాహంగా ముగిసింది.

వ్యాసకర్త
వేల్పుల మహేందర్
(ఎమ్మెస్సీ,ఎంఏ, ఎంఎడ్ సైన్స్ అధ్యాపకులు)



## బేతి మహేందర్ రెడ్డి సమన్వయంతో
# జనసేన సభ్యత్వ నమోదు ప్రక్రియ



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా బేతి మహేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్వయంగా తొలి సభ్యత్వాన్ని తీసుకొని రూ. 2 కోట్లు విరాళం అందించారని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న వారిని ఉద్యమి, సాధక్, ప్రదాతలుగా వర్గీకరించి పార్టీ పోరాటానికి బలాన్ని చేకూర్చేలా పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారని వివరించారు. సభ్యత్వం పొందిన వారికి రూ. 5 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించడం జనసేన ప్రత్యేకత అని, ఇంత మొత్తం భీమా ఏ రాజకీయ పార్టీ ఇవ్వలేదని అన్నారు. కరీంనగర్‌ను తెలంగాణలోనే సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలపడం లక్ష్యమని, ప్రైవేట్ ఉద్యోగులు, యూనియన్లు, వ్యాపారులు, కూలీలు, యువత, మహిళలు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అవినీతి, అక్రమాలపై, ప్రజా సమస్యలపై పోరాటమే జనసేన లక్ష్యమని, ఇతర పార్టీల అగ్ర నేతల అంతర్గత ఒప్పంద రాజకీయాలను ప్రజల ముందు ఎండగడతామని బేతి మహేందర్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ముఖ్యంగా కరీంనగర్‌లో వాహనదారులకు అడ్డంగా ఉన్న ఈద్గా గోడ తొలగింపుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్‌గా నియమించినందుకు పవన్ కళ్యాణ్, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు కందుల రాజీ రెడ్డి, శివ రెడ్డి, పెంటాల మహేష్, పొన్నాల తిరుపతి, వోద్నాల రాజు, జంగ మహేష్, వీర్ల శ్రీనివాస్ రావు, సిరిసిల్ల రాము, కందకట్ల స్వరూప, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## సప్తగిరి పాఠశాలలో చేతిరాత
# అభివృద్ధి ముగింపు సభ



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భగవతి విద్యాసంస్థల సహకారంతో గత 15 రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన చేతిరాత అభివృద్ధి ప్రత్యేక తరగతులు విజయవంతంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న భగవతి విద్యాసంస్థల అధినేత బి. రమణారావు మాట్లాడుతూ, చేతిరాత మారితే నుదిటి రాత మారుతుంది అని, మంచి చేతిరాత విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని పేర్కొన్నారు. పరీక్షకుని దృష్టిలో స్పష్టమైన చేతిరాత ఉన్న మూల్యాంకన పత్రం మంచి మార్కులు సాధించడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో దత్తత తీసుకున్న పాఠశాలలో నిర్వహించామని, ఊహించిన దానికంటే 99 శాతం విద్యార్థుల చేతిరాతలో అద్భుతమైన మార్పు చోటు చేసుకోవడం ఆనందదాయకమని రమణారావు తెలిపారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న విద్యాశాఖ సెక్టోరల్ అధికారి కర్ర అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్. భగవంతయ్య, ఇన్స్ట్రక్షన్ టీం సభ్యులు డాక్టర్ ముత్తినేని శ్రీనివాస్ మాట్లాడుతూ, మంచి చేతిరాత విద్యార్థుల మానసిక స్థితి, ప్రవర్తనను ప్రతిబింబిస్తుందని, భవిష్యత్తు విజయానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. రమణారావు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా కాలిగ్రాఫర్ శిక్షకుడు అఖిలేష్ నారాయణను, ఉచిత శిక్షణ అందించిన రమణారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. రాజేందర్, ఉపాధ్యాయులు గాజుల రవీందర్, మంజూరలి, శ్రీనివాస్, గీత, తిరుపతి, ప్రసాద్ రావు, రామారావు, పద్మజ, భారతి, హరిత, మమత, షబానా, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యా కమిషన్ ప్రతిపాదనలపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యా కమిషన్ సమర్పించిన తాజా రిపోర్ట్‌లో ఉపాధ్యాయుల జీతాలు ఎక్కువగా ఉన్నాయన్న వ్యాఖ్యలు, ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం ఇంక్రిమెంట్లను పనితీరు ఆధారంగానే ఇవ్వాలని చేసిన ప్రతిపాదనలు ఆక్షేపనీయమని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా స్పందించాయి. డీటీఫ్ జిల్లా అధ్యక్షుడు అవాల నరహరి, ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్ మాట్లాడుతూ, కొత్తగా 100 పాఠశాలలు ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గదే అయినా, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవడానికి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, తరగతి గది వంటి మౌలిక సదుపాయాలు అవసరమని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసి, ఎంసెట్ తొలగించి మార్కుల ఆధారంగా ఇంజనీరింగ్ సీట్లు కేటాయించడం వల్ల కార్పొరేట్ కాలేజీలకు లాభం చేకూరుతుందని, ఇది విద్యార్థులపై ఒత్తిడి పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిటిఏ జిల్లా అధ్యక్షుడు గాజుల రవీందర్, కార్యదర్శి మోతె చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల జీతాలు ఎక్కువ అన్న వ్యాఖ్యలు అన్యాయమని, సంవత్సరానికి ఒకటిన్నర నుంచి రెండు నెలల జీతాన్ని ఇన్కమ్ ట్యాక్స్ రూపంలో చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. పీఆర్సీ, డీఏలు, రిటైర్మెంట్ బకాయిలు చెల్లించకుండా వేతనాలపై వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. సమాజంలో ఉపాధ్యాయులు, సైనికులు, రైతులకు ఏమిచ్చినా తక్కువేనని, ఉపాధ్యాయులు బోధనతో పాటు ఎన్నికలు, సర్వేలు వంటి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని గుర్తుచేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించి హక్కులను గౌరవించాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

హెచ్.ఎం. ఇస్మాయిల్



**పాలకుర్తి, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు పాలకుర్తి మండలం జీడీ నగర్ యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ సూచించారు. శుక్రవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. పాఠశాల ప్రాంగణం రంగురంగుల అలంకరణలతో కళకళలాడింది. విద్యార్థులు తమ సీనియర్లకు శుభాకాంక్షలు తెలుపుతూ పాటలు, నృత్యాలు ప్రదర్శించారు. పదో తరగతి విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు భవిష్యత్తులో పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్‌లో బొమ్మ వెంకటేశ్వర్ బ్లాక్ ప్రారంభం



**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ లయన్స్ క్లబ్‌లో బొమ్మ వెంకటేశ్వర్ పేరుతో ఏర్పాటు చేసిన కొత్త బ్లాక్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సామాజిక సేవకు నిదర్శనమని, బొమ్మ వెంకన్న దూరదృష్టితో రేకుర్తిలో ఏర్పాటు చేసిన ఐ హాస్పిటల్ లక్షలాది పేదలకు ఉపయోగపడుతోందని గుర్తుచేశారు. 1988 నుండి నిరంతరంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న లయన్స్ క్లబ్ ఇప్పటి వరకు 8 లక్షల 52 వేల మందికి ఓపీ చికిత్స, 1,21,000 మందికి ఉచిత శస్త్రచికిత్సలు, 95 వేల మందికి బీపీఎల్ దాటిన వారికి సర్జరీలు అందించిందని వివరించారు. 9,000 గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించడం లయన్స్ క్లబ్ సేవా విస్తృతిని ప్రతిబింబిస్తోందని, విద్యావైద్య రంగాల్లో కూడా క్లబ్ విశేష సేవలు అందిస్తోందని మంత్రి అభినందించారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు 2010లో స్మశానవాటిక కోసం నాలుగున్నర ఎకరాల స్థలాన్ని కేటాయించడంలో లయన్స్ క్లబ్ సహకారం గుర్తుచేశారు. భవిష్యత్‌లో కూడా పేదలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు కొనసాగించాలని, యువతను సామాజిక సేవలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున, వ్యక్తిగతంగా, బొమ్మ వెంకన్న సోదరునిగా లయన్స్ క్లబ్ కోరిన సేవలకు అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

## పమేలా సత్పతి బదిలీపై భావోద్వేగ స్పందన



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా రెండు సంవత్సరాల పాటు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఐఏఎస్ అధికారి పమేలా సత్పతి బదిలీపై ఉద్యోగులు, అధికారులు, ప్రజలు తీవ్ర భావోద్వేగంతో స్పందించారు. టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బడుగుబలహీన వర్గాలకు అండగా నిలిచి, అనాథలకు వివాహాలు జరిపించి, అంగవైకల్యం ఉన్నవారికి మనోధైర్యం నింపిన ఆమె మానవతా సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించడం, ప్రతి శుక్రవారం ప్రజాసదస్సులు నిర్వహించి సమస్యలను స్వయంగా విని పరిష్కరించడం ఆమె ప్రత్యేకతగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో స్వయంగా వైద్యం చేయించుకోవడం ద్వారా ప్రజల్లో విశ్వాసం కలిగించిన కలెక్టర్‌గా ఆమెను ఉద్యోగులు, అధికారులు, ప్రజలు గుండెల్లో పెట్టుకుని పూజించేంత గౌరవాన్ని సంపాదించారని అన్నారు. జిల్లా కలెక్టర్లు వస్తారు, పోతారుడ కానీ కొందరు మాత్రమే చరిత్ర సృష్టించి నిలిచిపోతారు. అలాంటి వారిలో పమేలా సత్పతి ఒకరు అని భావోద్వేగంగా తెలిపారు. ఇంకొంతకాలం ఆమె సేవలు జిల్లాకు లభించి ఉంటే రూపురేఖలే మారిపోయేవని ఉద్యోగుల ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఈ ప్రకటనను జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావుతో కలిసి విడుదల చేశారు.

## విశ్రాంత ఉద్యోగుల నాయకులకు ఘన సన్మానం




**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరంలోని సంఘ భవనంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులను ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎండి ఉస్మాన్ భాష, ప్రధాన కార్యదర్శిగా జాలి మహేందర్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా నాగమోహన్, రాష్ట్ర కార్యదర్శిగా జీవి మనోహర్ కుమార్, కోశాధికారిగా రామచంద్రం ఎన్నికైన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు శ్రీధర్ రావు, గంట్ల నరసింహారెడ్డి, నరేందర్, రమేష్ రెడ్డి, రామ్ చంద్ర రావు, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, కర్ర ప్రభాకర్ రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయి ఉన్న డీఏలు, మెరుగైన పీఆర్సీ అమలు చేయడానికి జిల్లా, రాష్ట్ర నాయకత్వం కృషి చేయాలని కోరారు.

## మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ, న్యాయస్థానాల పట్ల గౌరవం ఉన్న వ్యక్తి అలా మాట్లాడరు. మేము వ్యక్తిగతంగా ఎవరికి వ్యతిరేకం కాదు. హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పుల తర్వాత ఆ స్థలం ప్రభుత్వానికి చెందినదని తేలింది. అందువల్ల అక్రమంగా ఉన్నవారిని తొలగించే ప్రయత్నం జరుగుతోంది అని తెలిపారు. కోర్టు తీర్పు పత్రాలను కేంద్ర మంత్రికి పంపిస్తామని, రాజకీయ ఆరోపణలు బాధ్యతతో చేయాలని సూచించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన రూ. 48 వేల కోట్ల రుణభారాన్ని రెండు సంవత్సరాల్లో తీర్చామని, కానీ కేంద్రం నుంచి రెండు బడ్జెట్లలో ఒక్క రూపాయి కూడా రాలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన విధంగా తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు. కేంద్రం సహాయం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం దౌర్భాగ్యం అని వ్యాఖ్యానించారు. రైతు భరోసా సహా ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని, కోర్టు తీర్పు ఎవరైనా గౌరవించాల్సిందేనని, రాజకీయ కక్ష సాధింపు ధోరణిలో బీజేపీ వ్యవహరిస్తోందని ఆయన అన్నారు. కవితకు కోర్టులో క్లీన్ చిట్ వచ్చినా ఒక అపవాదు మాత్రం ఉంది. దానికి సంబంధించి ప్రజలే నిర్ణయం చెబుతారు అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## కలెక్టర్ చిత్రా మిశ్రా- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం భేటీ



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రా, శుక్రవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు. జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకోవడంలో భాగంగా ఈ సమావేశం జరిగింది. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, తాజా పరిస్థితులు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు వంటి అంశాలపై కలెక్టర్, కమిషనర్ క్లుప్తంగా చర్చించారు. ప్రజా భద్రత, జిల్లా అభివృద్ధి కోసం రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.

## ప్రముఖ వైద్యుడు బీజేపీలో చేరిక



**జగిత్యాల, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ప్రముఖ వైద్యుడు అనూప్ రావు తన అనుచరులతో కలిసి భారీ సంఖ్యలో హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీకి చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచంద్రరావు సమక్షంలో, ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో ఆయన పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సి.ఎస్.ఆర్. నిధులతో మెడికల్ పరికరాల ప్రారంభం



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సి.ఎస్.ఆర్. నిధులతో అందించిన మెడికల్ పరికరాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన సప్తగిరి కాలనీలో జరిగిన శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంతు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలలో పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ సిఫార్సులపై

# ఎస్‌జీటీయూ ఖండన

**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



ప్రాథమిక విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ ఉపాధ్యాయుల జీతభత్యాలపై చేసిన వ్యాఖ్యలు సహేతుకం కావని ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడప శేఖర్ ఒక ప్రకటనలో ఖండించారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని నివేదికలో పొందుపరిస్తే సంతోషించేవారమని, కానీ ఉపాధ్యాయుల జీతాలు అధికంగా ఉన్నాయని చెప్పడం బాధాకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వంలో భాగమేనని, వారిని వేరుగా చూడడం తగదని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో ఉపాధ్యాయులకు మన దేశంలో కంటే ఎక్కువ వేతనాలు ఉన్నాయని, రాష్ట్రంలోని ఉపాధ్యాయులు నియామక సమయంలో తక్కువ జీతాలతో పనిచేసి, 30 సంవత్సరాలు సేవ చేసినా గౌరవప్రదమైన వేతనం అందుకోవడం లేదని తెలిపారు. ఒక నెల జీతాన్ని దాదాపుగా టాక్స్ రూపంలో చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. బోధనతో పాటు ఎన్నికలు, కుటుంబ సర్వేలు, జనాభా లెక్కలు వంటి అదనపు బాధ్యతలు కూడా ఉపాధ్యాయులు నిర్వర్తిస్తున్నారని, కేవలం జీతాల అంశాన్ని ప్రస్తావించడం అన్యాయమని అన్నారు. సంఘాలు ఇచ్చిన ప్రతిపాదనలను నివేదికలో పొందుపరచకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల నియామకం ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం జరుగుతుందని, పదోన్నతులు సీనియార్టీ ఆధారంగానే ఉంటాయని, జీతభత్యాలు పీఆర్సీ కమిటీ నివేదిక ప్రకారం నిర్ణయించబడతాయని, విద్యా కమిషన్‌కు దీనితో సంబంధం లేదని స్పష్టం చేశారు.

## హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో మౌలిక సదుపాయాల లోపం



**హుస్నాబాద్ , ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రతిష్టాత్మక పీఎంశ్రీ పథకానికి ఎంపికైన హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో మౌలిక సదుపాయాల లోపం విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. పాఠశాల చుట్టూ ముండ్ల పొదలు పేరుకుపోవడం, భవనం పక్కనే నీరు నిల్వ ఉండటం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే కిచెన్ షెడ్ నిర్మించి, మౌలిక సమస్యలను పరిష్కరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను కోరారు.

## కరీంనగర్ 51వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ 51వ డివిజన్‌లో రూ.16 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ బండారి వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లు నిర్మించింది. పేదలకు ఇండ్లు కట్టడంలో మోదీ పోటీ పడుతుంటే, పేదల ఇండ్లను కూల్చడంలో రేవంత్ రెడ్డి పోటీ పడుతున్నారు అని విమర్శించారు. రైతు భరోసా పథకం అమలు చేయకపోవడం, ఇచ్చిన హామీలను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైందని, మూడు విడతల రైతు భరోసా పేరుతో రూ.27 వేల కోట్లు బాకీ ఉన్నాయని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి తీరు మారకపోతే ప్రజలే ప్రభుత్వాన్ని కూల్చేస్తారు అని హెచ్చరించారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు ఒకటేనని, పైకి డ్రామాలు ఆడుతున్నాయని, కాళేశ్వరం అవినీతిపై విచారణ జరిపే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని ఆయన వ్యాఖ్యానించారు. తక్షణమే రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బండి సంజయ్ హెచ్చరించారు.

## 70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం



**కరీంనగర్,ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ మండలంలో పోలీసులు, టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో సుమారు 70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలింపు, నిల్వలను పట్టుకున్నారు. బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద ఒక ఆటోలో 12 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా గంట మల్లేశ్, గంట లక్ష్మణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరేపల్లి రాజరాజేశ్వరి కాలనీలో పత్తి స్వామి 20 క్వింటాళ్ల బియ్యం షెడ్‌లో నిల్వ ఉంచగా టాస్క్ ఫోర్స్ స్వాధీనం చేసుకుంది. కృష్ణానగర్ బొమ్మకల్‌లో గోడౌన్‌లో 39 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉంచిన శివనాథుని సత్యనారాయణ, పుల్లం సత్తయ్యలను ప్రశ్నించి కేసులు నమోదు చేశారు. మొత్తం 70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసి, కేసులు నమోదు చేశారు. పేదలకు ఉచితంగా ఇచ్చే బియ్యాన్ని దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌ను రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మారెడ్డి, నరేష్‌లతో పాటు టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**కరీంనగర్ రూరల్,
ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామానికి చెందిన పోగుల సంపత్ తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మర్యాదపూర్వక భేటీలు

**కరీంనగర్, ఫిబ్రవరి 27
(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కరీంనగర్ జిల్లా కొత్త కలెక్టర్ చిత్రా మిశ్రా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్‌ను కలెక్టర్ చిత్రా మిశ్రా కలసి పూల మొక్క అందజేశారు. అనంతరం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను కలసి పూల మొక్క అందించారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలెక్టర్ చిత్రా మిశ్రా మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్క అందజేశారు.

## చిన్నారి మృతిపై ఆగ్రహం

### హంతకునికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్

**అచ్చంపేట,
ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



నాగర్‌కర్నూల్ జిల్లా కుమేర గ్రామ శివాలయంలో కులవివక్ష కారణంగా జరిగిన దాడిలో రెండు నెలల చిన్నారి మృతి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నెల 18న రజక దళిత కుటుంబంపై రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తులు దాడి చేయగా, తల్లి చేతిలోంచి కిందపడిన శిశువు చికిత్స పొందుతూ మరణించింది. బాధితులపైనే కేసులు నమోదు చేయడం పట్ల బీసీ, దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ముగ్గురిపై కేసులు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న ఇతరులను కూడా హత్య నేరం కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండపల్లి శ్రీనయ్య మాట్లాడుతూ, చిన్నారి మృతికి కారణమైన మధుసూదన్ రెడ్డిని ఉరిశిక్ష వేయాలి. ఇలాంటి మానవ మృగాలు సమాజంలో ఉండకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి అని అన్నారు. అలాగే బాధిత గణేష్ కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు.

## భరోసా సంస్థ ఆధ్వర్యంలో బధిరుల పాఠశాలలో సైన్స్ డే వేడుకలు



**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫిబ్రవరి 28 నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని నగరంలోని భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బధిరుల పాఠశాలలో ముందస్తుగా సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు శివజ్యోతి మాట్లాడుతూ, వినికిడి మరియు మాటల లోపం కారణంగా పిల్లలు తమ ప్రతిభను వ్యక్తపరచలేకపోతారని, అందుకే సైన్స్ పటాల ద్వారా వారి మేధాశక్తిని వెలికితీసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా బధిరుల పాఠశాలలో సైన్స్ డే వేడుకలు నిర్వహించి, పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గర్రెపల్లి రాణిని ఆయన అభినందించారు. వేడుకల్లో బధిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తులసీరామ్, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

## కుమ్మెరలో పర్యటించిన కాంగ్రెస్ పార్టీ నిజ నిర్ధారణ కమిటీ

**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 27
(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కుమ్మెర గ్రామంలో జరిగిన సంఘటనపై కాంగ్రెస్ పార్టీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, నాయకులు బెల్లయ్య నాయక్, ఉబెద్దుల కొత్వాల్, డాక్టర్ కేతూరి వెంకటేష్, ఓబీసీ కన్వీనర్, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గల్లీ పరిశ్రమలపై కేంద్ర బడ్జెట్ విధానంపై విమర్శలు



**హుస్నాబాద్ ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుటీర పరిశ్రమలు, గ్రామీణ చేతివృత్తులు, చిరు వ్యాపారాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ విమర్శించారు. ఆయన మాట్లాడుతూ, దేశ సంపదను పెంచే పరిశ్రమలకు పనికిరాని బడ్జెట్ ప్రవేశపెట్టారు. కులవృత్తులు, కుటీర పరిశ్రమలు లేకుండా దేశ సంపద ఎలా అభివృద్ధి చెందుతుంది? చిన్న వ్యాపారులను, సాంప్రదాయ వృత్తులను బహుళజాతి కంపెనీలకు తాకట్టు పెట్టి స్వయం ఉత్పత్తులను కాలరాస్తున్నారు అని అన్నారు. మధ్యతరగతి అభివృద్ధి చెందాలంటే స్వయం ఉత్పత్తి రంగాలను బలోపేతం చేయాలని, వాటికి సరైన బడ్జెట్ కేటాయించి ప్రోత్సాహక ప్రణాళికలు రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంత టెక్నాలజీ పెరిగినా సమాజంలో వెనుకబాటుతనం ఉంటూనే ఉంటుంది. అందుకే స్వయం ఉత్పత్తులపై శ్రద్ధ పెట్టి కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# “సురక్షిత ప్రయాణం“పై అవగాహన కార్యక్రమం

-దేవరకొండ పోలీసు శాఖ, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో .




**దేవరకొండ ఫిబ్రవరి 27(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలో సురక్షిత ప్రయాణం పై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథిగా దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు ప్రాణాపాయం లేకుండా సురక్షితంగా డ్రైవింగ్ చేయాలని అన్నారు. ఎలాంటి మానసిక ఒత్తిడికి లోను కాకుండా డ్రైవింగ్ లో జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని అన్నారు. మద్యం సేవించి, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ వి టి మాట్లాడుతూ,ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని, డ్రైవింగ్లో నిర్లక్ష్యం పనికిరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సలాకమ్మ, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ రాజకుమార్ రెడ్డి, రవీంద్ర భారతి స్కూల్ రామకృష్ణ, బచ్పన్ స్కూల్ జి జంగయ్య, అన్వర్, శ్రీధర్, భాస్కర్, రాము, స్కూల్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి సహకరించాలి

-సర్పంచ్ గోపాల్



**కడ్తాల్, ఫిబ్రవరి 27 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దెలకుంట తాండాలో గ్రామపంచాయతీ నిధుల నుండి 4 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ నిధులతో ఆయా వార్డులో మురుగు కాల్వల నిర్మాణం చేయిస్తున్నట్లు వివరించారు. గ్రామంలోని అందరు తమ ఇంటి పన్నులు సకాలంలో చెల్లిస్తే మరింత అభివృద్ధి జరుగుతందని తెలిపారు. రోడ్లపై చెత్తను వేయకుండా ట్రాక్టర్ లో వేయాలని సూచించారు. తాగు నీటిని వృథాగా వదలకుండా అవసరాలకు వాడుకోవాలని తెలిపారు.. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు హనుమంతు నాయక్, అనిల్, సరిత పాండు, మాజీ సర్పంచ్ లక్ష్మీ కస్న నాయక్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు పవన్ కుమార్, రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి, తదితరులున్నారు.

# కొనసాగుతున్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**కడ్తాల్, ఫిబ్రవరి 27 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చని తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పండిత ప్రకర్ష శ్రీమాన్ తిరుమల వింజమూరి రామానుజాచార్యుల గారిచే రెండోరోజు శుక్రవారం ధ్వజారోహణం, బేరిపూజ, దేవతా ఆహ్వానం కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణంలో అర్చకులు భక్తుల వెంకటేశ్వర స్వామి నామస్మరణతో రావిచేడ్ మారుమోగుతోంది. కార్యక్రమంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్, ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు అర్చకులు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు..

# కుమ్మెర జాతర ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

-పసిబిడ్డ హత్య హంతకులపై హత్య కేసు పెట్టాలి
-బాధిత కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించాలి
-కుమ్మెర ఘటన దుండగులను కఠినంగా శిక్షించాలి
-కుర్మపల్లి గ్రామ ఉప సర్పంచ్ పుష్పాల శ్రీశైలం
-పసిపాప కుటుంబ సభ్యులను ప్రభుత్వమే ఆదుకోవాలి



**చింతపల్లి, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చిన్నారి మృతికి కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కుర్మపల్లి గ్రామ ఉప సర్పంచ్ పుష్పాల శ్రీశైలం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర గ్రామంలో పసిబిడ్డను అత్యంత క్రూరంగా కాలితో తన్ని హత్య చేసిన అగ్రకుల దురహంకారులను కఠినంగా శిక్షించాలని అన్నారు. పసిబిడ్డను హత్య చేసిన వారిపై అత్యాచార నిరోధక చట్టంతో పాటు అత్య నేరం కింద కేసు నమోదు చేసి తక్షణమే వారిని రిమైండ్ చేయాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం వల్లే కుమ్మరి మల్లన్న జాతరలో పసిపాప ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. గణేష్ అక్క కీర్తి, భార్య మౌనిక కాళ్ళు మొక్కడానికి ప్రయత్నం చేసిన కానీ కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల పసిబిడ్డ అని చూడకుండా మానవ మృగంలా కాలుతో తన్ని క్రూరంగా హత్య చేశారని చెప్పారు. ఈ ఘటన సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా మానవత్వాన్ని మంటగలిపే విధంగా ఉందన్నారు. సంఘటన ఈ నెల 18న జరిగితే పోలీసులు బాధితులే అగ్రకుల పెత్తందారులపై దాడి చేసినట్లుగా బాధితులపై కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటన జరిగి ఐదు రోజులు అవుతున్న బాధితులకు న్యాయం చేయడంలో పోలీసులు, అధికారులు జాప్యం చేయడంపై మండిపడ్డారు. కనుక నిర్లక్ష్యం వ్యవహరించిన ఎస్సై, సీఐలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలిపారు. కులం పేరుతో దూషించే సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో కులదూహంకార హత్యలు జరగకుండా ఉండాలంటే, ప్రభుత్వం రాజీపడకుండా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు. ఆ కుటుంబ సభ్యులను ఆర్థికంగా అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. చిన్నారి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేంతవరకు బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామని శ్రీశైలం తెలిపారు.

# జెఎన్ యు లో విద్యార్థులపై దాడి హేయమైన చర్య

## వీసీ తక్షణమే రాజీనామా చేయాలి.బిఎస్ఎఫ్ఐ




**దేవరకొండ ఫిబ్రవరి 27. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో విద్యార్థులు, అధ్యాపకులపై జరిగిన అమానుష దాడిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ . శుక్రవారం దేవరకొండ పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అండతోనే క్యాంపస్‌లలో మత విధ్వంశాలు స్వైరవిహారం చేస్తున్నారని మండిపడ్డారు.ముసుగులు ధరించి విద్యార్థినుల హాస్టళ్లలోకి చొరబడి,ఇనుప రాడ్లతో దాడి చేయడం పిరికిపంద చర్య అని విమర్శించారు.ప్రశ్నించే గొంతుకలను హింసతో అణచివేయలేరని,విద్యార్థి లోకం ఈ దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా విద్యార్థి నాయకుల బహిష్కరణ ఎత్తివేయాలని అన్నారు.విద్యార్థులు తమ విద్యార్థి సంఘాన్ని ఎన్నికల తమ ప్రతినిధులను ఎన్నుకున్నారని వి.సి.ని వైఖరిని ప్రశ్నించినందుకు వారిని క్యాంపస్ నుండి బహిష్కరణ చేయడం దుర్మార్గపు చర్య తక్షణమే వారిపై బహిష్కరణ ఎత్తివేయాలి లేకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు.వీసీకి పదవిలో ఉండే అర్హత లేదన్నారు.క్యాంపస్‌లో గంటల తరబడి హింస జరుగుతున్నా, పోలీసులు చూస్తూ ఉండిపోయారని,యూనివర్సిటీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని ధ్వజమెత్తారు. విద్యార్థులకు కనీస రక్షణ కల్పించలేని వీసీకి ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని, ఆయన వెంటనే వైదొలగాలని డిమాండ్ చేశారు.బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నక్క మొక్క గణేష్,చీమట శివ, జైరాం, అరవిందు,ప్రశాంతు,సంపత్,కొండల్,మహేష్,గంగరాజు, సాయిరాం,అభిషేక్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


# ఆధునిక సాంకేతికతతో మెరిసిన కడ్తాల్ “ప్రగతి“ విద్యార్థుల విజ్ఞాన మేళా

-సరికొత్త ఆలోచనలు
భవిష్యత్తుకు పునాదులు
-మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి




**కడ్తాల్, ఫిబ్రవరి 27 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
కడ్తాల్ గ్రామంలోని ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన “విజ్ఞాన మేళా 2026” చూడముచ్చటగా ఉందని మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు.శుక్రవారం ప్రారంభం అయిన మేళాను స్థానిక నేతలతో కలిసి సందర్శించారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన వినూత్న సైన్స్ నమూనాలు విద్యార్థుల యొక్క విజ్ఞానాన్ని కనబరుస్తున్నాయని అన్నారు. చిన్నారుల సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం ప్రతి స్టాల్‌లో స్పష్టంగా కనిపించిందని, విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టుల్లో సౌరశక్తితో నడిచే నీటిపారుదల యంత్రం, ఆటోమేటిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్, స్మార్ట్ సిటీ నమూనా, వర్షపు నీటి సంరక్షణ విధానం, ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానాల మాదిరి వినూత్న ఆవిష్కరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని అన్నారు.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రూపొందించిన ఈ నమూనాలు గ్రామీణాభివృద్ధికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని విద్యార్థులను కోరారు. పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థుల కృషి స్పష్టంగా కనిపిస్తుందని వారిని అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో వీరు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మొత్తం మీద కడ్తాల్ గ్రామంలో నిర్వహించిన విజ్ఞాన మేళా2026 విద్యా రంగంలో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపిందని, తను చదువుకున్న పాఠశాలలో విజ్ఞాన మేళాను సందర్శించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ సువర్ణగోవర్ధన్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, గంపా శ్రీనివాస్ గుప్తా,సిద్దిగారి వెంకటేష్, కంబాల అంజి,ముస్లి మహేష్,సురేష్,శ్రీను,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిఅండ్‌జి శిక్ష ద్వారా ప్రణాళికలో కోటి మంది విద్యార్థుల జీవితాల్లో మార్పు






-స్వచ్ఛంద సంస్థలు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో గిరిజన ప్రాంత విద్యార్థుల జీవితాల్లో మార్పు
-పి అండ్ జి ఇండియా కంపెనీ సీనియర్ డైరెక్టర్ బ్రాండ్ ఆపరేషన్ రజత్ బ్రార్
-కార్యక్రమానికి హాజరైన భారతీయ నటి ప్రణీత సుభాష్, సమీరా రెడ్డిలు

**కద్తాల్ , ఫిబ్రవరి 27, ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
గిరిజన ఆశ్రమ పాఠశాల చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులే లక్ష్యంగా వారిలో దాగివున్న ప్రతిభను గుర్తించేందుకు ల్యాప్ టాప్ లు అందజేసి వారికి శిక్షణ అందించేందుకు కోసం టీచర్లను ఏర్పాటు చేసి ఈ ప్రణాళికలో కోటి మంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు పి అండ్ జి శిక్ష వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అందులో విజయం సాధించడం గర్వంగా ఉందని పి అండ్ జి, శిక్ష ఇండియా కంపెనీ సీనియర్ డైరెక్టర్ బ్రాండ్ ఆపరేషన్ రజత్ బ్రార్ అన్నారు. శుక్రవారం కద్తాల్ మండలంలోని మైసిగండి గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రోత్ పార్టనర్ షిప్ ఎడ్యుకేషనల్ ఇన్షియోటిల్ మేనేజర్ ఆదర్శ రెడ్డి, ప్రముఖ భారతీయ సినీ నటి మనులు ప్రణీత సుభాష్, సమీరా రెడ్డి తదితరు పాల్గొన్నారు. వయసు గండి ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుండి చదివే విద్యార్థులు విద్యార్థులకు లాప్ టాప్ అందించి శిక్షణను అందించి వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన వక్తలు మాట్లాడుతూ సరైన ప్రణాళికలతో కోటి మంది పిల్లల జీవితాల్లో మార్పు తెస్తోంది. దేశంలోని వెనుకబడిన ప్రాంతాల చిన్నారి విద్యార్థుల చదువును మెరుగుపరచడమే లక్ష్యంగా తన కృషిని కొనసాగిస్తుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 35 వేల మంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడం జరుగుతుందన్నారు. భారతదేశంలో 5వ తరగతి చదువుతున్న పిల్లలలో 50 శాతం కంటే ఎక్కువ మంది కనీసం గ్రేడ్ 2 పాఠాలను కూడా చదవలేకపోతున్నారని (ఏసర్ 2024 నివేదిక ప్రకారం) పునాది స్థాయి అభ్యసన లోపాలను సరిదిద్దడం చాలా అవసరం అని తమ సంస్థ భావించిందన్నారు. దీని కోసం సమస్యను ముందుగానే గుర్తించడం, సరైన పరిష్కారాలను అందించడం కేవలం పాఠశాలల మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా, మారుతున్న విద్యా వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా అభ్యసన లోపాలను నివారించడం వాటిని సరిదిద్దడంపై దృష్టి సారించి సమగ్రమైన మార్పులను తీసుకువస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రోత్ అండ్ పార్టనర్‌షిప్స్, ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ మేనేజర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక కీలకమైన ప్యానెల్ చర్చ నిర్వహించాలన్నారు. ఇందులో భారతీయ నటి ప్రణీత సుభాష్, భారతీయ నటి, సెలబ్రిటీ ఇన్‌ఫ్లుయెన్సర్ సమీరా రెడ్డి, ప్రణవ్ కొఠారి (సీఈవో ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్), రజత్ బ్రార్ (సీనియర్ డైరెక్టర్, బ్రాండ్ ఆపరేషన్స్ ) పాల్గొన్నారు. ఈ మైలురాయిపై బ్రాండ్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ రజత్ బ్రార్ మాట్లాడుతూ 74% మంది తల్లిదండ్రులు చిన్నతనంలో చదువులో ఎదురయ్యే ఇబ్బందులను కేవలం ఒక దశగా మాత్రమే భావిస్తున్నారు. ఇవి బిడ్డ భవిష్యత్తుపై చూపే దీర్ఘకాలిక ప్రమాదాలను వారు తక్కువగా అంచనా వేస్తున్నారు. అభ్యసన లోపాలు తరచుగా ఎవరికీ తెలియకుండా, పరిష్కరించబడకుండా ఉండిపోతాయని చెప్పడానికి ఇది ఒక నిదర్శనం. అందుకే పి అండ్ జి శిక్ష కోటి మంది పిల్లలను చేరుకోవడం సరైన సమయంలో అందించిన క్రమబద్ధమైన మద్దతు వల్ల కోటి మంది పిల్లల్లో ఆత్మవిశ్వాసం మళ్లీ చిగురించిన పునాది స్థాయి అభ్యసన బలోపేతమైన క్షణాలకు ఇది ప్రతీక.

భారతీయ నటి ప్రణీత సుభాష్ మాట్లాడుతూ.. "సగానికి పైగా వయోజనులు తమ పాఠశాల రోజుల్లో కొన్ని సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నామని ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారనే విషయాన్ని తెలుసుకున్నప్పుడు, అది నా వ్యక్తిగత విషయంగా అనిపించింది. నేను కూడా అప్పట్లో అలాంటి ఆత్మసందేహాన్ని ఎదుర్కొన్నాను. ఇప్పుడు ఒక తల్లిగా, పిల్లల చిన్ననాటి ఇబ్బందులను ఎంత తేలికగా పట్టించుకోకుండా వదిలేస్తారో నాకు మరింత బాగా అర్థమవుతోంది. పి అండ్ శిక్ష సరైన సమయంలో స్పందించడం నాకు ఎంతగానో నచ్చింది. పిల్లల జీవితాల్లో వారు సానుకూల మార్పును తీసుకురావడం చూడటం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.

భారతీయ నటి, సెలబ్రిటీ ఇన్‌ఫ్లుయెన్సర్ సమీరా రెడ్డి మాట్లాడుతూ "మనలో చాలా మందికి పాఠశాల రోజుల్లో కొన్ని సబ్జెక్టులలో వెనుకబడిపోయిన జ్ఞాపకాలు ఉంటాయి. ఆ ప్రారంభ అనుభవాలు తరగతి గదికి ఆవల కూడా మన ఆత్మవిశ్వాసాన్ని ప్రభావితం చేస్తాయి. వాస్తవానికి ఏఎస్ఈఆర్ 2024 నివేదిక ప్రకారం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులలో 50 శాతం మంది రెండవ తరగతి స్థాయి పాఠ్యపుస్తకాన్ని కూడా చదవలేకపోతున్నారు. అందుకే పి అండ్ జి శిక్ష వంటి కార్యక్రమాలు చాలా అవసరం ఈ కార్యక్రమం యొక్క కృషికి నిదర్శనం అని ఆమె పేర్కొన్నారు.

ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ సీఈఓ ప్రణవ్ కొఠారి మాట్లాడుతూ ముందుగానే సమస్యలను గుర్తించేలా ఉండే ఒక సరైన ప్రణాళిక, పిల్లల అభ్యసన ప్రయాణాలను ఎలా మార్చగలదో మేం క్షేత్రస్థాయిలో చూస్తున్నాం. పి అండ్ జి శిక్ష తో మా భాగస్వామ్యం ద్వారా ఈ పరిష్కారాలను భారీ స్థాయిలో అమలు చేయగలిగాం. 'మైండ్‌స్పార్క్' వంటి అడాప్టివ్ టూల్స్ ప్రతి ఒక్కరి కచ్చితమైన అభ్యసన స్థాయిని అంచనా వేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, డిటిడిఓ రామేశ్వరి, ఏ టి డి ఓ వెంకటయ్య, ఏ సి ఎం ఓ అశోక్, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ ప్రేమా జవహర్ లాల్ నాయక్, ఉపసర్పంచ్ హీరా సింగ్, హె,చ్ఎం పాపయ్య, వార్డెన్ బాలరాజ్, పి అండ్ జి శిక్ష పిఆర్ఓ రాజు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి
-సర్పంచ్ ప్రవీణ్






**ఎలిగేడు, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మార్చి నెలలో జరగబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ, "విద్యార్థులు పరీక్షలపై దృష్టి సారించి కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి. మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి. అలాంటి విద్యార్థులకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను" అని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ గంద్ర దేవేందర్ రావు, వార్డు సభ్యుడు మడుపు నరేందర్, మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ అడ్డగుంట తిరుపతి గౌడ్, బోయిని సత్యం, రమేశ్, మధుకర్, రాకేశ్, ముంజంపల్లి అనిల్, సుమన్, అజయ్, సతీష్, సురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానను సందర్శించిన సర్పంచ్ కప్పల ప్రవీణ్



**ఎలిగేడు, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానను శుక్రవారం సర్పంచ్ కప్పల ప్రవీణ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలో మందులు అందుబాటులో ఉన్నాయా, రోజు వచ్చే రోగుల సంఖ్య ఎంత, ఆశా వర్కర్లు నిర్వహిస్తున్న విధులు ఎలా ఉన్నాయన్న విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్యం అందించి వారి మన్ననలు పొందాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు మడుపు నరేందర్, పల్లె దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మీపురం గ్రామంలో సిపిఎం మండల కమిటీ సమావేశం



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లక్ష్మీపురం గ్రామంలో సిపిఎం మిర్యాలగూడ మండల కమిటీ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేషన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, పార్టీ వన్ టౌన్ కార్యదర్శి మల్లు గౌతమరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చౌగాని సీతారాములు, రాగిరెడ్డి మంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ చైర్మన్ పత్యా నాయక్‌కు ఘన సన్మానం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు పూసల సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ చైర్మన్ పత్యా నాయక్‌కు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై విజ్ఞప్తి చేశారు. చైర్మన్ పత్యా నాయక్ మాట్లాడుతూ, "మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాను. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం నాయకులు, మాజీ వార్డు సభ్యుడు పూసలు సత్యం, దేరంగుల వెంకటేశ్, అధ్యక్షుడు నూతన గంటి వెంకటేశ్, నారాయణ, నరసింహ, బాలయ్య, అంజి, మోహన్, నరేందర్, సాయి, మహేష్, మహిళలు మంగమ్మ, శిరీష, మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కండె లింగయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్ మున్సిపాలిటీకి చెందిన వ్యాపారవేత్త కండె లింగయ్య దశదిన కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కండే లింగయ్య సేవలను స్మరించుకుని పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. తరువాత ఆయన కుమారులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రజల సంక్షేమం, ఆహార భద్రత, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు గురించి తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సయ్యద్ ఖలీల్, మాజీ మార్కెట్ డైరెక్టర్లు సుభాష్, రమేష్ నాయక్, సైదులు గౌడ్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో కాటన్ సెర్చ్ 411 ఇళ్లలో తనిఖీలు



బోడుప్పల్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ ఫేస్2, రాజీవ్ నగర్ కాలనీలలో గురువారం సాయంత్రం సీపీ అవినాష్ కుమార్ మహంతి ఆదేశాలతో, డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో 250 మంది పోలీసులతో కాటన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 411 ఇళ్లలో తనిఖీలు జరిపి, పలు దుకాణాల్లో రూ. 80 వేల విలువైన నిషేధిత గుట్కా, రూ. 9,000 విలువైన 10 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు సీజ్ చేశారు. డీసీపీ సురేష్ కుమార్ మాట్లాడుతూ, "నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పర్యవేక్షణ లక్ష్యంగా ఈ కాటన్ సెర్చ్ చేపట్టాం. మద్యం, గుట్కా, పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. ఒక రౌడీషీటర్‌ను గుర్తించాం. అనుమానితులకు ఫింగర్ ప్రింట్ పరీక్షలు నిర్వహించాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు మోహన్ కుమార్, వెంకట్ రెడ్డి, మేడిపల్లి సీఐ గోవర్ధన్ రెడ్డి, డీఐజీ ఎలక్షన్ రెడ్డి, భాస్కర్, రామలింగారెడ్డి, రాజు వర్మ, బాలస్వామి, శ్రీనివాస్, సబ్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# డీఎంకేలో చేరిన పన్నీర్ సెల్వం

**స్టాలిన్ నాయకత్వాన్ని అంగీకరిస్తున్నానని ప్రకటన**



**చెన్నయ్ ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, అన్నా డీఎంకే బహిష్కృత నేత ఒ.పన్నీర్‌సెల్వం శుక్రవారం డీఎంకేలో చేరారు. 2021 ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించిన బోడినాయక్కనూర్ శాసనసభ స్థానం నుంచే రాబోయే ఎన్నికలలో ఆయన డీఎంకే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఉంది. డీఎంకే కార్యాలయమైన అన్నా అరివాలయంలో ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. పన్నీర్‌సెల్వం రాష్ట్ర మంత్రి పీకే శేఖర్‌బాబుతో కలిసి ఒకే కారులో డీఎంకే కార్యాలయానికి చేరుకున్నారు. డీఎంకేలో చేరిక సందర్భంగా పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ 'ప్రజలు స్టాలిన్ సుపరిపాలనను అందిస్తున్నారు. ప్రజలు దానిని గమనిస్తున్నారు. ద్రవిడ ఉద్యమాన్ని, ద్రవిడ విధానాన్ని రక్షించేందుకు డీఎంకే కృషి చేస్తోంది. నేను ఇప్పుడు కేవలం ఓ కార్యకర్తగానే పార్టీలో చేరాను. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తాను' అని చెప్పారు. స్టాలిన్ నాయకత్వాన్ని అంగీకరిస్తున్నానని తెలిపారు. అన్నా డీఎంకే నుంచి బహిష్కృతుడైన మరో నేత, ఎఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్‌ను అన్నా డీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ఎన్డీఏ గూటికి ఆహ్వానించారు. పన్నీర్ సెల్వంను ఎన్డీఏలో చేర్చుకునే ప్రశ్నే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో మండిపడిన పన్నీర్ సెల్వం కొద్ది రోజుల క్రితమే స్టాలిన్‌తో భేటీ అయ్యారు. పన్నీర్ సెల్వం మద్దతుదారులైన ఇద్దరు ఎమ్మెల్యేలు ఇటీవలే పార్టీకి రాజీనామా చేసి డీఎంకేలో చేరారు. గత ఆగస్టులో పన్నీర్ సెల్వం ఎన్డీఏ నుంచి బయటికి వచ్చారు. బీజేపీ శిబిరం తనను అవమానిస్తోందని ఆరోపించారు. ఆ తర్వాత ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. అన్నా డీఎంకేలోని వర్గాలను కలపని పక్షంలో ఎన్డీఏలో చేరబోనని తేల్చి చెప్పారు. పన్నీర్ సెల్వం తమిళనాడుకు మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2001, 2014లో ఆయనను అన్నా డీఎంకే అధినేత్రి జయలలితే ముఖ్యమంత్రిని చేశారు. ఆమె మరణానంతరం 2016లో తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే కొద్ది నెలలకే పదవిని కోల్పోయారు. అనంతరం ఉప ముఖ్యమంత్రిగా, అన్నా డీఎంకే జాయింట్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. అయితే పళనిస్వామితో విభేదాలు పెరిగాయి. చివరికి 2022 జూలైలో పార్టీ నిబంధనావళిని సవరించిన పళనిస్వామి, ఆయనను అన్నా డీఎంకే నుంచి బహిష్కరించారు.

# సీఎంగా డీకే ఎప్పుడు?


**గందరగోళానికి తెరదించండి**
**అధిష్ఠానానికి మద్దతుదారుల విజ్ఞప్తి**



**బెంగళూరు, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం పోరు మరింత ఉధృతమైంది. ఓ హోటల్‌లో సమావేశమైన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మద్దతుదారులు.. తమ నాయకుడిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. శివకుమార్ అనుచరుడు, మగడి ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఓ హోటల్‌లో దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు భేటీ అయ్యారని, శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు లాబీయింగ్ చేయాలని నిర్ణయించారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ.. 'ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ ఇదేవిధంగా కొనసాగితే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ గెలవడం అసాధ్యం.నాయకత్వ మార్పిడి విషయమై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించాం' అని వెల్లడించారు. 'హైకమాండ్ నిద్రపోవడం లేదు.. కర్ణాటకలో ఏం జరుగుతున్నదో వారికి అన్నీ తెలుసు' అని అన్నారు. తమ నియోజకవర్గాలలోని ప్రజలు, కార్యకర్తలు రాష్ట్రంలో నాయకత్వం మార్పిడిని కోరుకుంటున్నారని చెప్పారు. 'సీఎంను మారుస్తారా? లేక పీసీసీ అధ్యక్షుడిని మారుస్తారా అన్నది హైకమాండ్ ఇష్టం. ఈ విషయంలో ఒక నిర్ణయం తీసుకుంటామని అధిష్ఠానం చెప్పలేదా? ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి, ఈ గందరగోళానికి తెరదించాలి' అని స్పష్టంచేశారు.

## అన్నాదమ్ములను పట్టిస్తే కోటి డాలర్లు..

**నజరానా ప్రకటించిన అమెరికా**




**శాన్ డీగో: ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమెరికా ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. మెక్సికోలోని సినలోవా కార్టెల్‌ను నిర్వహిస్తున్న ఇద్దరు అన్నాదమ్ములను పట్టిస్తే కోటి డాలర్ల నజరానా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. సినలోవా డ్రగ్ ముఠాకు చెందిన 42 ఏళ్ల రీని అర్జేట్ గార్సియాతో పాటు 52 ఏళ్ల ఆల్ఫాన్సో అర్జేట్ గార్సియా ఆ లిస్టులో ఉన్నారు. రీని అర్జేట్‌ను లా రాణా.. ద ఫ్రాగ్‌గా పిలుస్తారు. అల్ఫోన్సోను అచిలిస్‌గా పిలుస్తున్నారు. శాన్ డీగోలో జరుగుతున్న డ్రగ్ నేరాల్లో ఈ ఇద్దరి పాత్ర ఉన్నది. వీరిపై నార్కోటెర్రరిజం కేసులు ఉన్నాయి. ఒక్కొక్కరిపై అమెరికా ప్రభుత్వం 5 మిలియన్ల డాలర్ల నజరానా ప్రకటించింది. కాలిఫోర్నియా, మెక్సికో బోర్డర్ సమీపంలో సినలోవా, జాలిసికో డ్రగ్ ముఠాల మధ్య వార్ నడుస్తోంది. అయితే నాలుగు రోజుల క్రితమే జాలిసికో న్యూ జనరేషన్ కార్టల్ లీడర్ ఎల్ మెంచోను మెక్సిన్ ఆర్మీ హతమార్చిన విషయం తెలిసిందే.

## 'బ్లాక్'లో ఒకేసారి 40% ఉద్యోగులకు ఉద్వాసన



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇటీవల కాలంలో అత్యంత నాటకీయమైన ఉద్యోగుల తొలగింపులను బ్లాక్ కంపెనీ సీఈవో జాక్ డోర్సే ప్రకటించారు. తన కంపెనీలో ఒకేసారి 40 శాతం మంది ఉద్యోగులను తొలగించినట్టు ఆయన ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. దీంతో ఆయన కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 6 వేలకు పడిపోయింది.పదే పదే ఉద్యోగులను తొలగించడం వల్ల నైతికత దెబ్బతింటుందని, పని పట్ల దృష్టి ఉండదని, వినియోగదారుల, వాటాదారుల నమ్మకాన్ని పొందలేమని తెలిపారు. అందువల్ల తాను కఠిన, స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని.. తక్కువ మంది ఉద్యోగులతోనే ప్రస్తుత ఉత్పాదకతను సాధించగలమనే నమ్మకం తనకు ఉందని తెలిపారు. ఏఐ ఆధారిత ఆపరేషన్లను ముమ్మరం చేయాలనే ఉద్దేశంతోనే భారీగా ఉద్యోగులను తొలగించినట్టు ఆయన వెల్లడించారు.


## రీల్ తెచ్చిన చిక్కులు..
## ఆరుగురు ట్రైనీ పోలీసులకు షోకాజ్ నోటీసులు



**భోపాల్ -ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కానిస్టేబుల్స్‌గా కొత్తగా నియమితులైన పోలీసులు శిక్షణ పొందుతున్నారు. అయితే పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న ఆరుగురు ట్రైనీలు రీల్ రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో వారికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రేవాలోని పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఆరుగురు ట్రైనీ పోలీసులు ఒక రీల్ తీశారు. యూనిఫాంలో ఉన్న యువ పోలీసులు జోకులు వేశారు. తమకు ప్రభుత్వ ఉద్యోగం లభించడంపై గొప్పలు పోయారు. 'నేను అందంగా లేకపోతే ఏం? నాకు ప్రభుత్వ ఉద్యోగం ఉంది. నా వద్ద ఎక్కువ డబ్బు లేకపోతే ఏం? నాకు నెలవారీ జీతం వస్తుంది. నాకు ఎక్కువ బట్టలు లేకపోతే ఏం? నాకు యూనిఫాం ఉంది' అని వారు అన్నారు.కాగా, ఈ రీల్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో నెటిజన్లు భిన్నంగా స్పందించారు. ట్రైనీ పోలీసుల రీల్‌ను కొందరు ప్రశంసించగా మరికొందరు విమర్శించారు. ఈ నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి ఇది వెళ్లింది. మరోవైపు పోలీస్ యూనిఫాం ధరించి రీల్ చేయడాన్ని పోలీస్ శాఖ తప్పుపట్టింది. నియమ నిబంధనలు, క్రమశిక్షణను ఆ ట్రైనీ పోలీసులు ఉల్లంఘించినట్లు ఆరోపించింది. ఈ నేపథ్యంలో వారికి షో కాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరినట్లు పేర్కొంది. ప్రతిస్పందన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

# ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

**- కౌన్సిలర్ పాపిశెట్టి రాము**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. శుక్రవారం వెల్దండ మండలం గుండాల అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో పాపిశెట్టి రాము దంపతులు పాల్గొని అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చండీయాగంలో పాల్గొని స్వామి వారికి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దైవచింతనతోనే ముక్తి లభిస్తుంది. మానసిక ప్రశాంతత సాధ్యమవుతుంది. చెడు అలవాట్లు దూరమవుతాయి. ఆధ్యాత్మిక భావాలతో సమాజ శాంతి సాధ్యమవుతుంది. ప్రతి ఒక్కరూ నిత్యం దైవ నామస్మరణ చేయాలి" అని సూచించారు.

## గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర

**-ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి**



**ముచ్చింతల్, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు.ముచ్చింతల్ స్వర్ణ భారతీ ట్రస్ట్‌లో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన సర్పంచుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై, నూతనంగా ఎన్నికైన సర్పంచులతో తన అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "స్థానిక వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. పారిశుద్ధ్యం, మౌలిక వసతుల ఏర్పాటులో ముందుండి ప్రజలను మెప్పించాలి. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని మరింత ఉన్నత పదవులకు చేరుకోవాలి" అని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు





**కల్వకుర్తి, ఫిబ్రవరి 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో, మేరా యువ భారత్ సహకారంతో స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యువజన అధికారి కోటా నాయక్ హాజరై మాట్లాడుతూ, "యువత నైపుణ్యం కోసం కేంద్రం అనేక స్కిల్ డెవలప్‌మెంట్ పథకాలు అందుబాటులో ఉంచింది. అలాగే సొంత వ్యాపారాలు ప్రారంభించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకోవాలి" అని సూచించారు.స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ యాదయ్య మాట్లాడుతూ, "గ్రామీణ, పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు తీసుకొస్తున్నాయి. యువత వాటిపై అవగాహన కలిగి ఉండాలి. ప్రభుత్వ బడ్జెట్ ఖర్చులు ప్రజల వరకు చేరుతున్నాయా అనే విషయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్, సభ్యులు సాయి కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# ఐదేండ్లలో 500 నెక్సా స్టూడియోలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27**
కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ ఇండియా.. ప్రీమియం రిటైల్ చెయిన్ నెక్సాను భారీ స్థాయిలో విస్తరించబోతున్నది. 2030-31 నాటికి దేశవ్యాప్తంగా నెక్సా స్టూడియోల సంఖ్యను 700కి పెంచబోతున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. తన 200 అవుట్‌లెట్‌ను హర్యానాలో శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ..కంపెనీ మొత్తం విక్రయాల్లో 25-30 శాతం చిన్నగా ఏర్పాటు ప్రీమియం రిటైల్ అవుట్‌లెట్ల నుంచి సమకూరుతుండటంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు.గడిచిన ఏడాదిన్నరలో ప్రతి మూడు రోజులకు ఒక నెక్సా స్టూడియో(అవుట్‌లెట్)ను ప్రారంభించినట్టు చెప్పారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో నెక్సా నుంచి 40 శాతం సమకూరుతుండగా, మిగతా 60 శాతం అరెనా షోరూంల నుంచి లభిస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో ఏర్పాటు చేయనున్న నెక్సా స్టూడియోల్లో




ప్రీమియం అనుభూతి కల్పించనున్నట్టు, ముఖ్యంగా మెట్రోలు, ఈవీ చార్జింగ్ సదుపాయం కూడా ఈ స్టూడియోలో ఉంటుందన్నారు. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన తన తొలి ఈ-విటారా ఎస్‌యూవీ కోసం చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నది.

## 5 లక్షల కోట్ల సంపద ఆవిరి..
## సెన్సెక్స్ 961, నిఫ్టీ 318 పాయింట్ల పతనం



**ముంబై, ఫిబ్రవరి 27**
దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం, అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతుండటం, పలు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు మధ్యాహ్నం తర్వాత గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మరింత నష్టాల్లోకి నెట్టాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ వారాంతపు ట్రేడింగ్ ముగిసే సరికి 961.42 పాయింట్లు లేదా 1.17 శాతం కోల్పోయి 81,287.19 వద్ద ముగిసింది.మరో సూచీ నిఫ్టీ 317.90 పాయింట్లు లేదా 1.25 శాతం నష్టపోయి 25,178.65 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరులు రూ.5 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.4,98, 603.42 కోట్లు కరిగిపోయి రూ.4,63, 50, 671.27 కోట్లు (5.10 ట్రిలియన్ డాల ర్లు) చేరుకున్నది. దేశీయ స్టాక్ మార్కె ట్లు దిద్దుబాటుకు గురవుతున్నాయని, అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ఉండటంతో మదుపరుల్లో సెంటిమెంట్‌ను నీరుగార్చిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటం, ఏఐకి సంబంధించి అనిశ్చిత పరిస్థితులు కూడా తోడవడంతో మదుపరులు తమ పెట్టుబడులను ఈక్విటీల నుంచి బంగారం వైపు మళ్లించడం కూడా పతనానికి ఆజ్యంపోశాయన్నారు.

# నిధుల సేకరణలో బీవోబీ

ముంబై , ఫిబ్రవరి 27
ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) మరోసారి భారీ నిధులను సేకరించడానికి సిద్ధమైంది. వచ్చే నెల 4న గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్లను జారీ చేయడంతో రూ.10 వేల కోట్ల వరకు నిధులను సమీకరించాలనుకుంటున్నది. ఇష్యూ సైజ్ రూ.5 వేల కోట్లు కాగా, ఓవర్‌సబ్‌స్క్రిప్షన్ ద్వారా మరో రూ.5 వేల కోట్లను సేకరించాలనుకుంటున్నది. ఏడేండ్ల కాలపరిమితి కలిగిన ఈ బాండ్లు మార్చి 5, 2033న మెచ్యూరిటీ కానున్నాయి.వచ్చే బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ బాండ్ల కోసం బిడ్డింగ్‌ను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ బాండ్లకు కేర్ రేటింగ్, ఇక్రా ఏజెన్సీలు ఏఏఏ ఇచ్చాయి. ఈ బాండ్లపై వడ్డీరేటును వార్షికంగా చెల్లింపులు జరపనున్నది. కనీసంగా లక్ష రూపాయలు, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చునని బ్యాంక్ తెలిపింది.

Bank of Baroda


## స్పోర్ట్స్

# రేసు రసవత్తరం..
# న్యూజిలాండ్ కు షాకిచ్చిన ఇంగ్లండ్

**ఉత్కంఠ పోరులో కివీస్ ఓటమి పోటీలోనే పాక్!**

**కొలంబో**
టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్-1 మాదిరిగానే గ్రూప్-2లోనూ సెమీస్ రేసు రసవత్తరంగా మారింది. ఇంగ్లండ్‌తో కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌కు అనూహ్య షాక్ తగిలింది. అభిమానులను అలరించిన మరో 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో ఇంగ్లండ్‌దే పైచేయి అయింది. బ్రూక్ సేన.. 4 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తు చేసి సెమీస్ రేసును ఉత్కంఠగా మార్చింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 160 పరుగుల ఛేదనను ఆ జట్టు 19.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. టామ్ బ్యాంటన్ (24 బంతుల్లో 33, 3 ఫోర్లు, 1 సిక్స్), 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' విల్ జాక్స్ (18 బంతుల్లో 32 నాటౌట్, 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. ఇంగ్లిష్ బౌలర్లు కట్టడి చేయడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 రన్స్ చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (28 బంతుల్లో 39, 4 ఫోర్లు, 1 సిక్స్), టిమ్ సీఫర్ట్ (25 బంతుల్లో 35, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు.

**లోయరార్డర్ మెరుపులతో..**
ఛేదనలో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ కూడా తడబాటుకు గురైంది. హెన్రీ తొలి ఓవర్లోనే సాల్ట్ (2)ను బోల్తా




కొట్టించగా ఫెర్గూసన్.. ఫామ్‌లో లేని బట్లర్‌ను డకౌట్ చేశాడు. ఈ క్రమంలో గత మ్యాచ్ శతక హీరో కెప్టెన్ హ్యారీ బ్రూక్ (24 బంతుల్లో 26, 3 ఫోర్లు, 1 సిక్స్) కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. బెతెల్ (16 బంతుల్లో 21, 4 ఫోర్లు)తో కలిసి మూడో వికెట్‌కు 48 రన్స్ జతచేశాడు. అయితే 8వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన ఫిలిప్స్.. బ్రూక్‌ను వెనక్కి పంపగా రచిన్ ఓవర్లో బెతెల్ పెవిలియన్ చేరాడు.
కానీ కరన్, బ్యాంటన్ ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు ఈ జోడీ 42 రన్స్ జోడించి ఆ జట్టును పోటీలోకి తెచ్చింది. కానీ డ్రింక్స్ విరామం తర్వాత రచిన్ వరుస ఓవర్లలో కరన్, బ్యాంటన్‌నూ ఔట్ చేసినా కివీస్‌కు ఆ ఆనందం ఎక్కువసేపు దక్కలేదు. ఫిలిప్స్ ఓవర్లో జాక్స్.. 6, 4, 4తో 22 రన్స్ రాబట్టడంతో మ్యాచ్ ఇంగ్లండ్ వైపు మళ్లింది. ఆఖరి రెండు ఓవర్లలో ఆ జట్టు విజయానికి 21 పరుగులు అవసరమవగా శాంట్నర్ 19వ ఓవర్లోనూ 16 రన్స్ వచ్చాయి. చివరి ఓవర్లో జాక్స్ బౌండరీ కొట్టి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**పాక్ పోటీలోనే..**
కివీస్ ఓటమితో గ్రూప్-2లో సెమీస్ రేసు ఉత్కంఠగా మారింది. గ్రూప్-2లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఇంగ్లండ్ 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా న్యూజిలాండ్ మూడింట్లో ఒకటి గెలిచి ఒకటి వర్షం కారణంగా రద్దవడంతో 3 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఇంగ్లండ్ గెలవడంతో పాక్ సెమీస్ ఆశలు సజీవమయ్యాయి. శనివారం ఆ జట్టు.. పల్లెకెలెలో శ్రీలంకతో ఆడనున్న మ్యాచ్ ఫలితంతో సెమీస్ బెర్తు తేలనుంది.లంకను పాక్.. భారీ తేడాతో ఓడించి, ఆ జట్టు కివీస్ (+1.390) కంటే మెరుగైన రన్‌రేట్ (-0.461)ను సాధిస్తే అప్పుడు పాకిస్థాన్ సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. లంక గెలిస్తే కివీస్‌కు లైన్ క్లియర్ అవుతుంది. వర్షం కారణంగా మ్యాచ్ రైద్దైతే మాత్రం పాక్ తట్టాబుట్టా సర్దుకోవడమే!

**సంక్షిప్త స్కోర్లు**
న్యూజిలాండ్: 20 ఓవర్లకు 159/7 (ఫిలిప్స్ 39, సీఫర్ట్ 35, జాక్స్ 2/23, రషీద్ 2/28);
ఇంగ్లండ్: 19.3 ఓవర్లకు 161/6 (బ్యాంటన్ 33, జాక్స్ 32నా, రచిన్ 3/19, ఫెర్గూసన్ 1/14)

# మార్చి 28 నుంచి ఐపీఎల్!



**ముంబై**
క్రికెట్ అభిమానులకు శుభవార్త! టీ20 ప్రపంచకప్ టోర్నీతో ఎంజాయ్ చేస్తున్న అభిమానులను మండు వేసవిలో మజా అందించేందుకు ఐపీఎల్ రాబోతున్నది. మార్చి 28 నుంచి ఐపీఎల్ 19వ సీజన్ మొదలయ్యే అవకాశముంది. వాస్తవానికి మార్చి 26 నుంచే మొదలుకావాల్సి ఉన్నా..పశ్చిమబెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ రాష్ట్రాల్లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ రెండు రోజులు ఆలస్యంగా లీగ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నదిదీనికి తోడు ఈ మూడు రాష్ట్రాల్లో ఎన్నికల తేదీలను అనుసరించి ఒకేసారి పూర్తి షెడ్యూల్ కాకుండా రెండు దశల్లో విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు బోర్డు వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్‌లు ఈడెన్‌గార్డెన్స్‌లో సీఎస్‌కే మ్యాచ్‌లు చెన్నైలో, రాజస్థాన్ తమ రెండో వేదికగా గువాహటిని ఎంచుకున్న నేపథ్యంలో షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకునే అవకాశముంది. ఇదిలా ఉంటే బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణపై ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం అనుమతి ఇచ్చినా..రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) హోంగ్రౌండ్‌పై స్పష్టత రావాల్సి ఉంది.

# రింకూకు పితృ వియోగం

**నోయిడా:**
భారత క్రికెట్ జట్టు బ్యాటర్ రింకూ సింగ్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. అతడి తండ్రి ఖాన్‌చంద్ సింగ్ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. స్టేజ్-4 లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన.. గత కొన్ని రోజులుగా అందుకు సంబంధించిన చికిత్స తీసుకుంటున్నారు. ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్న టీ20 ప్రపంచకప్ సందర్భంగా జింబాబ్వేతో మ్యాచ్‌కు ముందు తండ్రి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రింకూ ఉన్నఫళంగా



అతడిని చూసేందుకు హాస్పిటల్‌కు వెళ్లాడు.అయితే అతడు తిరిగి జట్టులో చేరగా వెంటిలేటర్ సాయంతో ఉన్న ఖాన్‌చంద్.. శుక్రవారం ఉదయం కన్నుమూశారు. విషయం తెలిసిన వెంటనే రింకూ.. హుటాహుటిన చెన్నై నుంచి ఢిల్లీకి బయల్దేరాడు. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన ఖాన్‌చంద్.. ఓ గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్లు డెలివరీ చేస్తూనే కొడుకు కలలను నెరవేర్చాడు. రింకూ కెరీర్ ఎదుగుదలలో ఖాన్‌చంద్ పాత్ర ఎంతో ఉంది.